www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 07 | గురువారం | 6 ఆగస్టు, 2026



# జూరాల.. నిండుకుండలా

కృష్ణానది ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కర్ణాటకలోని ఆల్మట్టి నారాయణపూర్ జలాశయాలు పూర్తిగా నిండడంతో కృష్ణా నదిపై ఉన్న జలాశయాలకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. దీంతో తెలంగాణలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,45,000 క్యూసెక్కుల నీరు వస్తుండగా అధికారులు 33 గేట్లు ఎత్తి 2,18,790 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. అదేవిధంగా ఈ ప్రాజెక్టు ఎగువ, దిగువ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ శ్రీశైలం వైపునకు 26,208 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 318.516 మీటర్లకు 317.38 మీటర్లుగా ఉన్నది. నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలకు 7.426 టీఎంసీలుగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. – ప్రజానావ, గద్వాల

## హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ

- నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు అందజేత
- 8 కాలేజీలపై చర్యలకు ఆదేశం

2




## ఇక ఏ ఫిర్యాదుకైనా ఒకే నెంబర్

- తెలంగాణలో డయల్ 112 సేవలు ప్రారంభం
- పోలీస్, ఫైర్, అంబులెన్స్ సహా 18 రకాల సేవలకు ఇదే నెంబర్
- ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్

2

# తుమ్మిడిహెట్టికి అనుమతులిప్పించండి

### తెలంగాణ-మహారాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేయండి

- కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి
- పీఎంకు రాసిన లేఖ.. పీఎంవో స్పందనపై చర్చ
- చర్చల ప్రక్రియ ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి పాటిల్ హామీ

**న్యూఢిల్లీ:** ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. బుధవారం న్యూఢిల్లీలో జల్‌శక్తి మంత్రితో సమావేశమైన సీఎం, ఈ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాసిన లేఖతో పాటు ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి జల్‌శక్తి మంత్రిత్వ శాఖకు పంపిన సమాచారాన్ని ప్రస్తావించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే తెలంగాణ, మహారాష్ట్రల మధ్య ఒప్పందం కుదిరిందని సీఎం గుర్తు చేశారు. అయితే 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారానే నీటి సరఫరా సాధ్యమవుతుందని, దీంతో విద్యుత్ వినియోగ భారం తగ్గుతుందని వివరించారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నిర్వహించిన అధ్యయనం ప్రకారం 148 మీటర్లు, 152 మీటర్ల ఎత్తుల్లో నిర్మాణం చేపట్టినా ముంపు ప్రభావంలో పెద్దగా తేడా లేదని, ముంపు ప్రాంతంలో సగానికి పైగా నదీగర్భమే ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటి అవసరాలను తీర్చడంలో ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని తరువాయి 2లో..



## విదేశీ పర్యటనకు సీఎం రేవంత్ రెడ్డి

### షరతులతో అనుమతిచ్చిన ఏసీబీ కోర్టు

- రూ.1 లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు ష్యూరిటీ సమర్పించాలని ఆదేశం
- యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించనున్న ముఖ్యమంత్రి

2



## 15ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు

- నిరసనకారుల ఇళ్లపైకి గూండాలను పంపారు
- మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ ఆరోపణలు

2



### 22ఏ భూముల విషయంలో అర్హులెవ్వరికీ

# అన్యాయం జరగదు

- కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు
- ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలి
- అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలి
- దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలి
- జిల్లాల కలెక్టర్లకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో అర్హులైన ఏ భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల హక్కులను పరిరక్షించడంతో పాటు ప్రభుత్వ భూములను కాపాడటమే ప్రభుత్వ విధానమని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని స్పష్టం చేశారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి 22ఏ భూములకు సంబంధించిన అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. వివిధ మాధ్యమాల్లో వచ్చిన కథనాలు, ప్రజల ఫిర్యాదులు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. 22ఏ అంశంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. అర్హులైన వ్యక్తులకు న్యాయం చేయడం ఎంత ముఖ్యమో, ప్రభుత్వ భూములను పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను చట్టబద్ధంగా, రికార్డుల ఆధారంగా సమగ్రంగా పరిశీలించి అర్హత ఉన్న భూములపై ప్రజలకు న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. 22ఏకు సంబంధించిన తరువాయి 2లో..

# భద్రాచలం వద్ద రెండో బ్రిడ్జి నిర్మాణం

**పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం :** భద్రాచలం రామాలయం దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం రెండో బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2015లో గోదావరి పుష్కరాల సందర్భంగా వచ్చిన లక్షలాది మంది భక్తులకు ఒ బ్రిడ్జి ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు వచ్చాయని ప్రస్తావించారు. భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మిస్తున్న రెండో బ్రిడ్జి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి పనుల గురించి అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడారు. అమరావతి టూ జగదల్‌పూర్ జాతీయ రహదారిని భద్రాచలం మీదుగా ప్లాన్ చేసి రెండో బ్రిడ్జిని నిర్మిస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఈ బ్రిడ్జి అప్రోచ్ వరద కోతకు గురవకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నట్లు వివరించారు. ఈ నెలలో గోదావరి రెండో బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగుతాయని చెప్పుకొచ్చారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అందుబాటులోకి ఈ బ్రిడ్జిని తీసుకువస్తామని తెలిపారు. సీఆర్ హయాంలో ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయని అన్నారు. ఏపీ, ఛత్తీస్గఢ్, ఒడిశా వయా భద్రాచలం వెళ్లే ప్రయాణికులకు ఈ రెండో బ్రిడ్జి ఎంతో సౌకర్యంగా ఉంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# కొరియర్ బాయ్‌గా వచ్చి మహిళ మెడలో గొలుసు చోరీ

**సీసీ ఫుటేజి ఆధారంగా దొంగను పట్టుకున్న పోలీసులు**

**ప్రజానావ, హైదరాబాద్ :** మియాపూర్ పరిధిలో కొరియర్ బాయ్‌గా నటిస్తూ ఇంట్లోకి ప్రవేశించిన ఓ యువకుడు మహిళపై పెప్పర్ స్ప్రే చల్లి బంగారు మంగళసూత్రాన్ని అపహరించిన ఘటన కలకలం రేపింది. సీసీటీవీ ఫుటేజీ, సాంతిక ఆధారాల సహాయంతో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాధితురాలు ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో కొరియర్ డెలివరీ పేరుతో వచ్చిన నిందితుడు.. మహిళ ముఖంపై పెప్పర్ స్ప్రే చల్లి ఆమె మెడలో ఉన్న సుమారు నాలుగు తులాల బంగారు మంగళసూత్రాన్ని లాక్కుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై బాధితురాలి భర్త మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన మియాపూర్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి, బంగారు మంగళసూత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో నిందితుడు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు చెందిన షేక్ ఖాజా అర్షద్ (20)గా గుర్తించారు. నిందితుడిపై గతంలో ఏపీలోని కనిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు క్రిమినల్ సులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

# 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు

- **నిరసనకారుల ఇళ్లపైకి గూండాలను పంపారు**
- **మీడియా సమావేశంలో రాహుల్ ఆరోపణలు**

**న్యూఢిల్లీ:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం అణిచివేతకు పాల్పడిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బుధవారం నిరసనలో పాల్గొన్న విద్యార్థులతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన, శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాడుతు న్న యువతను బెదిరింపులు, బలప్రయోగాలతో మౌనంగా మార్చే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు.

## ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్య

నిరసనల్లో పాల్గొన్న విద్యార్థుల ఇళ్లకు గూండాలను పంపించారని, 15 ఏళ్ల బాలికతో బలవంతంగా క్షమాపణలు చెప్పించి, ఆ క్షమాపణలను అధికారికంగా అంగీకరించారని రాహుల్ ఆరోపించారు. ఇది పూర్తిగా అర్థరహితమని, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్యగా ఆయన అభివర్ణించారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించిన రాహుల్, నిరసనకారులు ఎలాంటి హింసకు పాల్పడలేదని స్పష్టం చేశారు. తమ భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులకు కాంగ్రెస్ అండగా ఉంటుందని, దేశంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పనిచేసే విద్యా వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

# జైలైనా.. ఉరి శిక్షైనా బంగ్లాకు తిరిగివెళ్తా

- **ప్రజాస్వామ్య పునరుద్ధరణే లక్ష్యమన్న మాజీ ప్రధాని షేక్ హసీనా**
- **అవామీ లీగ్‌పై నిషేధం ఎత్తివేయడంతో పాటు రాజకీయ ఖైదీల విడుదలకు డిమాండ్**
- **మీడియా సమావేశంపై బంగ్లా తీవ్ర అభ్యంతరం**




న్యూఢిల్లీ: జైలు శిక్ష ఎదురైనా, ఉరిశిక్ష విధించినా ఈ ఏడాది డిసెంబరులో తప్పకుండా బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్తానని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రకటించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించి, అభివృద్ధి మార్గంలో నడిపించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. 2024 ఆగస్టు 5న భారీ నిరసనల నేపథ్యంలో భారత్‌కు వచ్చిన అనంతరం తొలిసారిగా బుధవారం వర్చువల్ మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తనపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపినా, ప్రాణహాని కలిగించినా ప్రజల మధ్యకు తిరిగి వెళ్లడాన్ని ఎవరూ అడ్డుకోలేరని హసీనా అన్నారు. అధికారాన్ని తిరిగి పొందడానికే కాదు, ప్రజలకు భద్రత, అభివృద్ధి, శాంతి, లౌకికవాదాన్ని పునరుద్ధరించడానికే స్వదేశానికి వెళ్లాలనుకుంటున్నానని తెలిపారు. 1975లో తన కుటుంబాన్ని కోల్పోయినా, ప్రవాస జీవితం గడిపినా ఎన్నో సవాళ్లను ఎదుర్కొని రాజకీయ పోరాటం కొనసాగించానని గుర్తుచేశారు. అవామీ లీగ్‌పై విధించిన నిషేధాన్ని వెంటనే ఎత్తివేయాలని, రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని, తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని హసీనా డిమాండ్ చేశారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, మీడియా స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ స్వతంత్రతను పునరుద్ధరించాలని కోరారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం భయానక వాతావరణం నెలకొందని, ప్రజాస్వామ్యం తీవ్ర సంక్షోభంలో ఉందని ఆరోపించారు.

## భారత్ గొప్ప మిత్రదేశం

కష్టకాలంలో భారత్ ఎప్పుడూ బంగ్లాదేశ్‌కు అండగా నిలిచిందని హసీనా పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితులు కేవలం ఆ దేశానికే పరిమితం కావని, దక్షిణాసియా శాంతి, భద్రత, అభివృద్ధిపైనా ప్రభావం చూపుతాయని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో అంతర్జాతీయ సమాజం బంగ్లాదేశ్ ప్రజలకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2024లో జరిగిన విద్యార్థుల ఆందోళనలు సహజసిద్ధమైన ఉద్యమం కాదని, కొన్ని వ్యవస్థీకృత శక్తులు రాజకీయ ప్రయోజనాల కోసం వాటిని హింసాత్మకంగా మలిచాయని హసీనా ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న బీఎన్‌పీ ప్రభుత్వంతో ఎలాంటి రహస్య చర్చలు జరపడం లేదని, తాను స్వదేశానికి తిరిగి వెళ్లాలనే నిర్ణయంపై ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు.

## ఢాకా ఆగ్రహం

హసీనా మీడియా సమావేశం భారత్‌లో నిర్వహించేందుకు అనుమతించడంపై బంగ్లాదేశ్ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత గడ్డపై నుంచి బంగ్లాదేశ్, అక్కడి ప్రజలపై విమర్శలు చేయడం తమ దేశ సార్వభౌమాధికారానికి విరుద్ధమని విదేశాంగ శాఖ పేర్కొంది. 2013లో కుదిరిన అప్పగింత ఒప్పందం ప్రకారం హసీనాను బంగ్లాదేశ్‌కు అప్పగించాలని పలుమార్లు కోరినా భారత్ నుంచి ఇప్పటికీ స్పందన రాలేదని తెలిపింది.



# హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

- **నో అబ్జెక్షన్ ఫైర్ సర్వీస్ పత్రాలు ఇంటర్ బోర్డుకు సమర్పణ**
- **8 కాలేజీలపై చర్యలకు ఆదేశం**

**ప్రజానావ, హైదరాబాద్:** హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు (ఎన్‌ఓసీ) రూపొందించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ నకిలీ పత్రాలను ఇంటర్మీడియట్ బోర్డుకు సమర్పించి గుర్తింపు పొందేందుకు ఎనిమిది ప్రైవేటు జూనియర్ కళాశాలలు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. పత్రాల పరిశీలనలో కమిషనర్ సంతకం నకిలీ చేసినట్లు నిర్ధారణ కావడంతో సంబంధిత కళాశాలలపై చర్యలు ప్రారంభించారు. ఆయా కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు అధికారులు సిఫారసు చేశారు. అలాగే ఈ ఘటనపై లేక్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ఫోర్జరీ, నకిలీ పత్రాల తయారీ తదితర కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో తెల్లాపూర్, చిక్కడపల్లి, ఎస్ఆర్‌నగర్, మెహిదీపట్నం, బర్కత్‌పురా ప్రాంతాలకు చెందిన ఎనిమిది ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఈ అక్రమానికి పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఇదే తరహాలో సమర్పించిన మరో 60 ప్రైవేటు కళాశాలల ఫైర్ ఎన్‌ఓసీ పత్రాలను కూడా అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వాటి ప్రామాణికతపై విచారణ కొనసాగుతోందని, దర్యాప్తులో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికారులు వెల్లడించారు.

# తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేసే కుట్ర

- **గోదావరి రివర్ బోర్డు ఎజెండాలో ఏపీకి అనుకూల నిర్ణయాలు**
- **18న జరిగే భేటీ ఉన్నా ఎందుకు నోరు మెదపడం లేదు?**
- **కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి హరీశ్ రావు**



**ప్రజానావ, హైదరాబాద్:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాధించిన తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేసే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. ఈ నెల 18న జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశ ఎజెండాలో తెలంగాణకు మంజూరైన ఏడు ప్రాజెక్టుల అనుమతుల సమీక్ష అంశాన్ని చేర్చడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ, కాళేశ్వరం, సీతారామ, సమ్మక్క సాగర్ వంటి ప్రాజెక్టులకు ఇప్పటికే అన్ని అనుమతులు లభించాయని, వాటిని తిరిగి సమీక్షించి రద్దు చేయాలనే ప్రతిపాదన దేశంలో ఎక్కడా లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరిన వెంటనే జీఆర్ఎంబీ ఎజెండాలో ఈ అంశాన్ని చేర్చడం తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. ఎజెండా విడుదలై వారం రోజులు గడిచినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించకపోవడం ఆశ్చర్యకరమని హరీశ్‌రావు అన్నారు. తెలంగాణకు చట్టబద్ధంగా లభించిన గోదావరి జలాల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం మౌనంగా ఉండటం వెనుక లోపాయికారీ ఒప్పందాలున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు.

## ఒక్క కొత్త ప్రాజెక్టుకూ అనుమతులు తీసుకురాలే

బీఆర్ఎస్ ప్రభుత్వం కష్టపడి ఏడు ప్రాజెక్టులకు అనుమతులు సాధించగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ప్రాజెక్టుకూ అనుమతులు తీసుకురాలేదని విమర్శించారు. పైగా సమ్మక్క సాగర్, పాలమూరు ఎత్తిపోతల పథకం వంటి ప్రాజెక్టుల డీపీఆర్‌లు వెనక్కి వచ్చాయని, ఇప్పుడు ఇప్పటికే వచ్చిన అనుమతులను కూడా రద్దు చేసే పరిస్థితి తీసుకొచ్చారని మండిపడ్డారు. తెలంగాణ నీటి హక్కులను పరిరక్షించడంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ రెండూ విఫలమయ్యాయని హరీశ్‌రావు ఆరోపించారు. జీఆర్ఎంబీ ఎజెండా నుంచి గోదావరి ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను వెంటనే తొలగించాలని, లేదంటే తెలంగాణ ప్రయోజనాల కోసం మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేయడం అంటే సగం తెలంగాణకు అన్యాయం చేసినట్లేనని ఆయన పేర్కొన్నారు.

# సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన

- **షరతులతో అనుమతిచ్చిన ఏసీబీ కోర్టు**
- **రూ. లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు ష్యూరిటీ సమర్పించాలని ఆదేశం**
- **యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించనున్న ముఖ్యమంత్రి**



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనకు ఏసీబీ ప్రత్యేక కోర్టు షరతులతో అనుమతి మంజూరు చేసింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 10 వరకు యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో పర్యటించేందుకు అనుమతించింది. ఈ మేరకు కోర్టు కస్టడీలో ఉన్న ఆయన పాస్‌పోర్టులను తాత్కాలికంగా విడుదల చేయాలని ఆదేశించింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే లక్ష్యంతో విదేశీ పర్యటన చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి తరపు న్యాయవాది కోర్టుకు వివరించారు. పాస్‌పోర్టులను తాత్కాలికంగా అప్పగించి విదేశీ ప్రయాణానికి అనుమతి ఇవ్వాలని కోరగా, కోర్టు పిటిషన్‌ను పాక్షికంగా అనుమతిస్తూ పలు షరతులు విధించింది. రూ.1 లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు ఒక ష్యూరిటీ సమర్పించాలని కోర్టు ఆదేశించింది. విదేశీ పర్యటనకు సంబంధించిన పూర్తి ప్రయాణ వివరాలు, బస చేసే చిరునామాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లను కోర్టుకు అందజేయాలని సూచించింది. అలాగే సెప్టెంబర్ 18లోగా పాస్‌పోర్టులను తిరిగి కోర్టులో జమ చేస్తానంటూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది.

# తమిళనాట తొలి బడ్జెట్ ప్రవేశ పెట్టిన విజయ్ ప్రభుత్వం

- **'అన్నన్ సీర్ తిట్టవ్'నకు బడ్జెట్‌లో రూ.812 కోట్లు టాయింపు**
- **పథకం కింద వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీర**

**చెన్నై :** తమిళనాడు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. సీఎంగా విజయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తీసుకొచ్చిన తొలి బడ్జెట్ కావడంతో సర్వత్రా ఆసక్తి వ్యక్తమైంది. ఆర్థిక మంత్రి ఎన్. మేరీ విల్సన్ దీనిని సభ ముందుంచారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, మహిళా సంక్షేమం, మౌలిక సదుపాయాలపై విజయ్ సర్కార్ ఈ పద్దులో ప్రధానంగా దృష్టిసారించింది. ఎన్నికల హామీల్లో భాగమైన 'అన్నన్ సీర్ తిట్టవ్'ను టీవీ ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ప్రకటించింది. దానికింద వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టుచీరను అందిస్తారు. ఈ పథకం కోసం రూ.812 కోట్లు టాయించారు. 2031 నాటికి ఐదు లక్షల మందికి కృత్రిమ మేధలో శిక్షణ ఇస్తామని ప్రకటించింది. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులకు ఈ శిక్షణ అందనుంది. వెట్రిథిరన్ ట్రైనింగ్ స్కీమ్ కింద దశలవారీగా లక్షమంది ఉద్యోగార్థులు నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందనున్నారు. రూ.2వేల కోట్లతో విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్స్ అందించేందుకు వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్‌ను బ్జడెట్‌లో ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ కోసం ఈ ఏడాదికి రూ.300 కోట్లు టాయించారు. 'పుతియా పయనం–పుతియా వేగం' పథకం కింద 11వ తరగతి చదివే 5.3 లక్షల మంది విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందించనున్నారు. వాటితో పాటు హెల్మెట్లు, వాటర్ బాటిళ్లు ఇవ్వనున్నారు. కుటుంబ పెద్దగా ఉన్న మహిళకు ప్రతినెలా రూ.2,500, ఏడాదికి ఉచితంగా 6 వంటగ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ యువతకు ఆర్థిక సాయం, మహిళలకు అన్ని ప్రభుత్వ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం వంటి హామీలపై మాత్రం బడ్జెట్లో ప్రకటన రాలేదు.

# డిసెంబర్‌లో 'తెలంగాణ రైజింగ్-2026' గ్లోబల్ సమ్మిట్

- **సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు చేయాలి**
- **సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలి**
- **భారీ పెట్టుబడుల ఆకర్షణకు గ్లోబల్ సమ్మిట్ వేదికగా నిలవాలి**
- **ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**



**ప్రజానావ, హైదరాబాద్ :** డిసెంబర్‌లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్–2026' గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అయ్యేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, తెలంగాణ రైజింగ్?2047 లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారం అత్యంత అవసరమని అన్నారు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్డీపీ) వృద్ధికి గ్లోబల్ సమ్మిట్ కీలక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. తెలంగాణను అభివృద్ధి, పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణలు, ఉపాధి కల్పన, సంక్షేమం వంటి అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ భవన సముదాయాలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే రహదారులు, విద్యుత్, తాగునీటి సరఫరా తదితర మౌలిక సదుపాయాలను సకాలంలో సిద్ధం చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం, యువతకు నైపుణ్యాభివృద్ధి అవకాశాలను విస్తరించడం, ఉపాధి కల్పనను పెంపొందించడం, డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా అందించడం వంటి అంశాలపై సమావేశంలో అధికారులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్–అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, టీజీఐఐసీ ఎండీ శశాంక, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురెట్టి తదితరులు పాల్గొన్నారు.

# ఇక ఏ ఫిర్యాదుకైనా ఒకే నెంబర్

- **తెలంగాణలో డయల్ 112 సేవలు ప్రారంభం**
- **పోలీస్, ఫైర్, అంబులెన్స్ సహా 18 రకాల సేవలకు ఇదే నెంబర్**
- **ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్**



**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో అత్యవసర సేవలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకొచ్చే డయల్–112 సేవలను రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ బుధవారం కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ప్రారంభించారు. ఇకపై పోలీస్, అగ్నిమాపక, అంబులెన్స్‌తో పాటు మొత్తం 18 రకాల అత్యవసర సేవలకు ప్రజలు 112 నెంబర్‌ను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, న్యాయసాయం, వైద్యసాయం, సైబర్ నేరాల ఫిర్యాదులు సహా పలు అత్యవసర సమస్యలకు డయల్–112 ద్వారా తక్షణ స్పందన అందిస్తామని చెప్పారు. 112కు వచ్చే ఏ కాల్‌నూ తిరస్కరించబోమని, ప్రతి ఫిర్యాదుపై తప్పనిసరిగా స్పందిస్తామని స్పష్టం చేశారు. టీజీఐసీసీ (తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్) నుంచి ఈ సేవలను పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. కాల్ వచ్చిన వెంటనే కాలర్ లొకేషన్‌ను గుర్తించే ఆధునిక సాంకేతిక వ్యవస్థను వినియోగిస్తున్నామని, భవిష్యత్తులో డ్రోన్ ఆధారిత సాంకేతికత, కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో అత్యవసర సేవలను మరింత సమర్థవంతంగా అందించనున్నట్లు తెలిపారు.

## 3.0 వెర్షన్‌గా అమల్లోకి

డయల్–112 సేవలు 3.0 వెర్షన్‌గా అమల్లోకి వస్తున్నాయని, టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌కు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని డీజీపీ చెప్పారు. కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లోని రెండు అంతస్తులను ప్రత్యేకంగా డయల్–112 కోసం కేటాయించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ప్రజల భద్రత, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన అందించడమే ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# ఝార్ఖండ్ పరీక్షల అక్రమాలపై ఆందోళన ఉధృతం

- **నాలుగో రోజుకు చేరుకున్న దేవేంద్రనాథ్ మహ నిరాహార దీక్ష**
- **జేపీఎస్సీ పరీక్ష రద్దు, సీబీఐ విచారణకు డిమాండ్**

**రాంచీ:** ఝార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థుల ఆందోళనలు ఉధృతమయ్యాయి. జేపీఎస్సీ పరీక్షను రద్దు చేసి సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ దేవేంద్రనాథ్ మహ నాలుగో రోజూ నిరాహార దీక్ష కొనసాగించారు. ఆయన ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఫోన్‌లో మాట్లాడి కనీసం నీరు తాగాలని సూచించగా, మహ ఆ మేరకు నీరు స్వీకరించారు. మరో ఐదుగురు దీక్షలో చేరడంతో నిరాహార దీక్ష చేస్తున్న వారి సంఖ్య ఆరుగురికి చేరింది. జేపీఎస్సీ, జేఎస్సీఎస్సీల్లో సంస్కరణలు చేపట్టాలని, పరీక్షల అక్రమాలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని నిరసనకారులు కోరుతున్నారు. ఇప్పటివరకు ఈ కేసులో 14 మందిని సీఐడీ అరెస్టు చేయగా, దర్యాప్తు కొనసాగుతోంది.

# తుమ్మిడిహెట్టికి అనుమతులిప్పించండి

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్న సీఎం, ఈ అంశంపై తెలంగాణ–మహారాష్ట్రల మధ్య వీలైనంత త్వరగా సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

## ఇరు రాష్ట్రాల అధికారులతో మాట్లాడుతాం

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ స్పందిస్తూ, ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఈ అంశంపై లేఖ అందిందని తెలిపారు. ముందుగా కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహించి చర్చలు ప్రారంభిస్తామని, అనంతరం తెలంగాణ, మహారాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పలువురు తెలంగాణ ఎంపీలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 22ఏ భూముల విషయంలో అర్హులెవ్వరికీ అన్యాయం జరగదు

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తులు, ఫిర్యాదులను ఏ స్థాయిలోనూ పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అలాగే హైకోర్టు నిర్దేశించిన 45 రోజుల వ్యవధిలోనే 22ఏ భూముల వివాదాలపై తుది నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములపై అక్రమ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, ఆక్రమణలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి హెచ్చరించారు. ప్రజల హక్కులు, ప్రభుత్వ ప్రయోజనాల మధ్య సమతుల్యత పాటిస్తూ పారదర్శకంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్. లోకేశ్‌కుమార్, స్టాంపులు–రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రస్తుతానికి ఒత్తిడి వర్గంగానే సీజేపీ

- **సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే**
- **సోనమ్ వాంగ్‌చుక్ మా మార్గదర్శిగానే కొనసాగుతారు**

**ముంబై:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రస్తు తం రాజకీయ పార్టీగా కాకుండా ప్రజా సమస్యలపై ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రెజర్ గ్రూప్‌గా పనిచేస్తుందని ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తెలిపారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్ లో బుధవారం జరిగిన కోర్ కమిటీ సమావేశానికి ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. మీడియా, న్యాయవ్యవస్థపై ప్రజల్లో తగ్గుతున్న విశ్వాసం, ఇథనాల్ మిశ్రమ ఇంధనం, నిరుద్యోగం వంటి అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపా రు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, ఇతర పరీక్షల అక్రమా లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని పార్టీ ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ వెల్లడించారు. సామాజిక కార్యకర్త సోనం వాం గ్‌చుక్ పార్టీకి మార్గదర్శిగా కొనసాగుతారని, ఆందో ళనల్లో గాయపడిన విద్యార్థులకు న్యాయ, వైద్య సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.



## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

ప్రజానావ, జమ్మికుంట: తెలంగాణ పోలీసుల 'సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్ఐ రవి విద్యార్థులకు డిజిటల్ అరెస్ట్, నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, ఓటీపీ మోసాలపై అవగాహన కల్పిస్తూ, తెలియని వ్యక్తులకు ఓటీపీ చెప్పవద్దని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాదం సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## పదవి పొందినా పలకరింపు మారలేదు

ప్రజలకు చేరువగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజానావ, వేములవాడ: ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా అదే నిరాడంబరత, అదే ఆప్యాయతతో ప్రజల్లో కలిసిపోతూ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తన ప్రత్యేకతను మరోసారి చాటుకున్నారు. ప్రజాప్రతినిధి అంటే ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలనే భావనతో ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా పలకరిస్తూ, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ప్రజలతో మమేకమవుతున్నారు.ఇటీవల అటుగా వెళ్తూ కొల్లూరి శ్రీనివాస్ గుప్త కిరాణా దుకాణం వద్ద ఆగిన ప్రభుత్వ విప్, స్థానికులతో కాసేపు ఆత్మీ యంగా ముచ్చటించారు. ఆయనను కలిసిన ప్రజలు, కార్యకర్తలతో సాదాసీ దాగా మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నా రు. అధికార పదవిలో ఉన్నాననే భావనకు దూరంగా ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మెలగడం, ప్రజల సమస్యలను ఓపికగా వినడం, అందు బాటులో ఉండడం ఆయన నాయకత్వంలోని ప్రత్యేక లక్షణాలుగా స్థానికులు పేర్కొంటున్నారు. పదవి వచ్చినా తన స్వభావాన్ని మార్చుకో కుండా ప్రజలతో మమేకమవుతుండటంతో ఆయనపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతోందని అభిప్రాయపడుతున్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎగువ మా ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ మహేష్ బీ గీతే



ప్రజానావ, గంభీరావుపేట: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ మానేరు ప్రాజెక్ట్ కు వస్తున్న వరద నీటి నేపథ్యంలో నీటి పారుదల, రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్ట్ ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం, ఎగువ నుంచి వరద తదితర అంశాలపై జిల్లా నీటి పారుదల శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ఎగువ మానేరు ప్రాజెక్ట్ లోకి ప్రస్తుతం కూడవెల్లి, పాల్వంచ వాగుల నుంచి ఇన్ ఫ్లో లేదని, ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 2 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 1. 6 టీఎంసీల నీరు ఉందని నీటి పారుదల శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. మానేరు ప్రాజెక్ట్ లోకి వరద చేరి పూర్తి స్థాయి నీరు నిండే అవకాశం ఉందని, నీటి పారుదల శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి మట్టాన్ని పరిశీలిస్తూ.. ప్రాజెక్ట్ పరిధిలోని గ్రామాల రైతులు, ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేయాలని ఆదేశించారు. ప్రాజెక్ట్ మత్తడి పారితే పోలీస్, రెవెన్యూ అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నియంత్రించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ ఎస్పీల వెంట సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, ప్రశాంత్, తహసీల్దార్ మారుతి రెడ్డి గ్రామ సర్పంచ్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు సర్వం సిద్ధం

- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నేడు భారీ సభ
- కల్వకుంట్ల కవితతో కలిసి 10 వేల మంది ప్రతినిధుల సంకల్ప ప్రతిజ్ఞ



ప్రజానావ, హైదరాబాద్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కానున్న ఈ సభలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం కల్వకుంట్ల కవితతో కలిసి సుమారు 10 వేల మంది ప్రతినిధులు సంకల్ప ప్రతిజ్ఞ చేయనున్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సాధికారతే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన భవిష్యత్ కార్యాచరణను కవిత ప్రకటించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాల స్ఫూర్తితో సామాజిక న్యాయ తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి పనిచేస్తామని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు రాజకీయంగా అధిక ప్రాధాన్యం కల్పించే దిశగా పార్టీ ముందుకు సాగుతుందని పేర్కొంటున్నారు. సభా ప్రాంగణాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రి బాయి పూలే, భాగ్యరెడ్డి వర్మ, చాకలి ఐలమ్మ, కొమురం భీమ్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, కాన్షీరాం, కొండా లక్ష్మణ్ బాపూజీ తదితర మహనీయుల చిత్ర పటాలతో ప్రత్యేకంగా అలంకరించారు. హైదరాబాద్ నుంచి ప్రారంభమయ్యే సామాజిక న్యాయ ఉద్యమాన్ని గ్రామస్థాయి వరకు విస్తరించేలా తెలంగాణ రక్షణ సేన కార్యాచరణ చేపట్టనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.



## శిఖండి రాజకీయాలు మానుకుని ప్రజా సమస్యలపై పోరాడాలి: బీజేపీ

ప్రజానావ, హుజురాబాద్: హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రజా సమస్యలను విస్మరించి శిఖండి రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు విమర్శించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని, రోడ్లు, తాగునీరు, సాగునీరు, ఉపాధి, విద్య, వైద్య రంగాల సమస్యలపై దృష్టి పెట్టకుండా రాజకీయ ప్రత్యర్థులపై విమర్శలకే పరిమితమవుతున్నారని ఆరోపించారు. ఇటీవల నిర్వహించిన సర్వేల్లో ఎమ్మెల్యే ప్రజాదరణ కోల్పోయి మూడో స్థానానికి చేరారని పేర్కొంటూ, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. లేకుంటే రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన తీర్పు ఇస్తారని సంపత్‌రావు హెచ్చరించారు.

## ప్రతి చిన్నారికి భద్రత, విద్య, సంరక్షణ కల్పించాలి

- అనాథలు, చదువు మానేసిన పిల్లలను గుర్తించి అండగా నిలవాలి
- అధికారులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు



ప్రజానావ, పెద్దపల్లి: జిల్లాలో ప్రతి చిన్నారికి భద్రత, విద్య, సంరక్షణతో పాటు ప్రభుత్వ పరిరక్షణ సేవలు సమర్థవంతంగా అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమీకృత బాలల సంరక్షణ పథకం అమలుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోని అనాథ పిల్లలను పూర్తిస్థాయిలో గుర్తించాలని, అలాగే దివ్యాంగులు, మానసిక వైకల్యం ఉన్న చిన్నారులను గుర్తించి వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ (సీసీఐ) హోమ్‌లలో ఉన్న పిల్లలకు అవసరమైన వసతులు, సంరక్షణ, భద్రత కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. పిల్లలకు ఎక్కడైనా సమస్య తలెత్తిన వెంటనే స్పందించేలా జిల్లాను మూడు విభాగాలుగా విభజించి పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువు మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి విద్యాభ్యాసంలోకి తీసుకువచ్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కేంద్రాల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశాన్ని వినియోగించుకో వాలని, ఆసక్తి ఉన్న వారి వివరాలను సేకరించాలని సూచించారు. సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, జువెనైల్ జస్టిస్ బోర్డు పరిధిలోని కేసుల పురోగతి, బాలల గృహాల తనిఖీలు, ఫోస్టర్ కేర్, స్పాన్సర్‌షిప్ పథకాల అమలు, మిస్సింగ్, ఫౌండ్ చిల్డ్రన్ కేసులు, బాలల భద్రత చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. ఫీల్డ్ విజిట్లు క్రమం తప్పకుండా నిర్వహించాలని, అన్ని ఆన్‌లైన్ యాప్‌లలో సమాచారాన్ని ప్రతిరోజూ నవీకరిం చాలని, పెండింగ్ అంశాలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ప్రభుత్వ లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయడంతో పాటు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని, ప్రతి మండలంలో బాలల సంక్షేమ కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రూ.100 కోట్ల వ్యయంతో సంగారెడ్డిలో రోడ్ల అభివృద్ధి

- 29 కి.మీ. ఆర్‌అండ్‌బీ, 54 కి.మీ. పంచాయతీరాజ్ రోడ్లకు నిధుల మంజూరు
- త్వరలో పనుల ప్రారంభానికి కసరత్తు



ప్రజానావ, సంగారెడ్డి: సంగారెడ్డి నియోజకవర్గంలో రూ.100 కోట్ల వ్యయంతో 83 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధి పనులకు నిధులు మంజూర య్యాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. ఇందులో 29 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్లు, 54 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్ల అభివృ ద్ధి చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పనులను త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో జగ్గారెడ్డి, నిర్మల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దెబ్బతిన్న రోడ్లకు కనీసం రెన్యువల్ పనులు కూడా చేపట్టలేదని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్మించిన రోడ్లనే ఇప్పటికీ ప్రజలు వినియోగిస్తున్నారని, మరమ్మతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని ప్రధాన రహదారులు, గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలను అనుసంధానించేలా కొత్త రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో కొత్తగా నిర్మించాల్సిన రోడ్లతో పాటు ఇప్పటికే పూర్తయి పెండింగ్‌లో ఉన్న పనుల బిల్లుల అంశంపై కూడా చర్చించినట్లు చెప్పారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయించే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడతానని స్పష్టం చేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి–65 నుంచి లక్డారం–బ్యాతోల్ మీదుగా ఇస్మాయిల్‌ఖాన్‌పేట వరకు 6.20 కి.మీ., పరివార్ దాబా నుంచి ఇస్మాయిల్‌ఖాన్‌పేట వరకు 6.50 కి.మీ., పెద్దాపూర్–అనంత్‌సాగర్ మార్గంలో తొగర్‌పల్లి, అలియాబాద్, కొండాపూర్, మారేపల్లి మీదుగా 16.10 కి.మీ. రోడ్ల అభివృద్ధి చేపట్టనున్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా జాతీయ రహదారి–65 నుంచి చిమ్నాపూర్ తండా, జేసీ బంగ్లా–రాజంపేట–మల్కాపూర్ ఎక్స్‌రోడ్, సంగారెడ్డి–తాళ్లపల్లి, శంకర్‌పల్లి రోడ్డు–చేర్యాల, కంది మండలంలోని మామిడిపల్లి–తున్కిల తండా, ఎర్దనూరు–ఇస్మాయిల్‌ఖాన్‌పేట, కలివేముల – చెర్లగూడెం, సదాశివపేట–మెలిగిరిపేట, సదాశివ పేట – మాచిరెడ్డిపల్లి, అనంత్‌సాగర్ – రేజింతల్, మోమిన్‌పేట రోడ్డు–అనంత్‌సాగర్, కొండాపూర్–ఎదురుగూడెం, గొల్లపల్లి – పరమేశ్వర గుట్ట, కొండా పూర్ – నాగ్‌సాన్‌పల్లి, మారేపల్లి – సీహెచ్ కోనాపూర్ తదితర ప్రాంతాల్లో మొత్తం 54 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు అధికారులు వెల్లడించారు.



## రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బద్ది పోచమ్మకు బోనాలు

ప్రజానావ, వేములవాడ : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గ్రామదేవత శ్రీ బద్దిపోచమ్మ అమ్మవారి బోనాల మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉప్పుగడ్డ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన బోనాల ఊరేగింపు డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, సాంప్రదాయ నృత్యాల నడుమ ఆలయం వరకు వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎల్. రమాదేవి బోనం సమర్పించగా, ఆలయ అధికారులు, ఉద్యోగులు, టిఎన్ జీవో నాయకులు, ప్రజాప్రతినిధులు, వేద పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.



## పంట కుంటలతో రైతులకు బహుళ ప్రయోజనాలు

- తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- వర్షపు నీటి సంరక్షణతో పాటు అదనపు ఆదాయానికి పంట కుంటలు దోహదం
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ప్రజానావ, కామారెడ్డి: జిల్లాలోని రైతులు తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ వ్యవసాయ భూముల్లో పంట కుంటలను నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గాంధారి మండలం పోతాయిపల్లి ఖుర్దు గ్రామంలో తెలంగాణ జలసిరి కార్యక్రమం కింద నిర్మించిన వ్యవసాయ పంట కుంటను ఆయన పరిశీలించారు. పంట కుంట ద్వారా బహుళ ప్రయోజనాలు పొందుతున్న రైతు ప్రతాప్‌రెడ్డిని అభినందించి సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పంట కుంటల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని ఎండాకాలంలో సాగునీటిగా వినియోగించుకోవచ్చని తెలిపారు. పంట కుంటల్లో చేపల పెంపకం చేపట్టి రైతులు అదనపు ఆదాయం పొందే అవకాశం కూడా ఉంటుందని పేర్కొన్నారు. పంట కుంటల వల్ల భూగర్భ జలాల మట్టం పెరిగి పరిసర ప్రాంతాల్లోని బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని వివరించారు. నీటి సంరక్షణ, మత్స్య సంపద అభివృద్ధి, భూగర్భ జలాల పెరుగుదల వంటి ప్రయోజనాలతో రైతుల ఆదాయం పెరిగి సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందని చెప్పారు. జిల్లాలోని రైతులందరూ తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని వినియోగించుకుని తమ భూముల్లో పంట కుంటలను నిర్మించుకొని ఈ బహుళ ప్రయోజనాలను పొందాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, ఎంపీడీవోతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## దుబాయ్‌లో పాతబస్తీ యువతి మిస్సింగ్

ప్రజానావ, హైదరాబాద్ :దుబాయ్‌లో హైదరాబాద్ యువతి మిస్సింగ్ కలకలం రేపుతోంది. గత కొద్ది నెలలుగా ఆమె నుంచి ఎటువంటి ఫోన్ కాల్స్ కానీ.. సమాచారం కానీ లేకపోవడంతో ఆందోళన చెందిన ఆమె కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు ఆర్జీఐఏ పోలీసులుసు నమోదు చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతబస్తీకి చెందిన ఓ కుటుంబ పెద్ద మృతిచెందడంతో ఆ కుటుంబం ఆర్థికంగా బాగా చితికిపోయింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తన కుటుంబాన్ని పోషించేందుకు వైద్య విద్య పూర్తి చేసిన ఓ యువతి (24) ఉపాధి కోసం దుబాయ్‌కు వెళ్లింది. గత ఏడాది ఆగస్టులో దుబాయ్‌కు వెళ్లిన ఆమె అక్కడి ఓ ఆస్పత్రిలో విధుల్లో చేరింది. దుబాయ్ వెళ్లిన తర్వాత సదరు యువతి కొంతకాలం పాటు కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడేది. అయితే గత నాలుగు నెలలుగా ఆమె నుంచి ఎటువంటి సమాచారం లేదు. ఆమె రెండు ఫోన్లకు కాల్ చేసినా పనిచేయడం లేదు. దీంతో కంగారుపడిపోయిన కుటుంబసభ్యులు దుబాయ్‌లో ఉన్న తెలిసి వారి ద్వారా ఆరా తీశారు. అయినప్పటికీ యువతి ఆచూకీ లభించలేదు.

## సిరిసిల్ల-సిద్దిపేట జాతీయ రహదారి.. (ఎన్‌హెచ్-365 బీ) నాలుగు లేన్ల విస్తరణపై కదలిక

బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

ప్రజానావ, సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా అభివృద్ధిలో కీలకమైన సిరిసిల్ల–సిద్ది పేట (దుద్దెడ) జాతీయ రహదారి ( ఎన్ హెచ్–365 బి ) నాలుగు లేన్ల విస్తరణ పనుల్లో చురుకైన కదలిక వచ్చింది. ఈ ప్రాజెక్టు డీపీఆర్ (డిపిఆర్) ఆమోదాన్ని వేగవంతం చేయడంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి చేసిన కృషి సత్ఫలితాలను ఇస్తున్నది. జిల్లా ప్రజల రవాణా అవసరాలను, ట్రాఫిక్ కష్టాలను తీర్చాలనే సంకల్పంతో, గోపి ఇటీవల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కలిసి ఈ రహదారి విస్తరణపై వినతిపత్రం అందజేశారు. దీనిపై కేంద్ర మంత్రి కార్యాలయం సానుకూలంగా, తక్షణమే స్పందించింది. గోపి అభ్యర్థన మేరకు, కేంద్ర రోడ్డు రవాణా అలాగే రహదారుల శాఖకు హోంశాఖ సహాయ మంత్రి కార్యాలయం అధికారికంగా లేఖను (30 జులై 2026 తేదీతో) ఫార్వార్డ్ చేసింది. హోంశాఖ సహాయ మంత్రి ప్రైవేట్ సెక్రటరీ (ఐఏఎస్ ఆంధ్ర వంశీ), రోడ్డు రవాణా శాఖ మంత్రి ప్రైవేట్ సెక్రటరీ (ఐఏఎస్ దీపక్ షిండే) కి పంపిన ఈ లేఖలో.. నిబంధనల ప్రకారం డీపీఆర్ ఆమోదానికి తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో చొరవ తీసుకుని, రోడ్డు రవాణా శాఖను అప్రమత్తం చేసి ఫైల్ కదిలేలా చేసిన రెడ్డబోయిన గోపి కృషి పట్ల స్థానికులు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభమైతే సిరిసిల్ల, సిద్దిపేట ప్రాంతాల మధ్య రవాణా సులభతరం కావడంతో పాటు ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందని ప్రజలు భావిస్తున్నారు.


MoS/Home/BSY/4401064/127/2026

Andra Vamsi, IAS

PRIVATE SECRETARY TO MINISTER OF STATE FOR HOME AFFAIRS GOVERNMENT OF INDIA KARTAVYA BHAVAN-3, NEW DELHI - 110001

Dear Shri Deepak Shinde,

Office of Hon'ble Minister of State for Home Affairs, Shri Bandi Sanjay Kumar, is in receipt of a request from Shri Gopi Reddaboina, District President, BJP, Rajanna Sircilla, Telangana, to expedite DPR approval for four laning of Sircilla -Siddipet (Duddeda) section of NH-365 B.

2. As desired by Hon'ble Minister, I am to forward the above request for appropriate action as per norms.

With regards,

Yours sincerely,

(Andra Vamsi)

Shri Deepak Shinde, IAS,
Private Secretary to
Hon'ble Minister of Road Transport and Highways,
Transport Bhavan,
New Delhi - 110001

## మూలవాగు ప్రాజెక్టుకు పొంచి ఉన్న ప్రమాదం

ఎడమ కాలువ వద్ద మూడు మీటర్ల లోతు వరకు కుంగిన కట్ట ప్రాంతం





ప్రజానావ, కోనరావుపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నిమ్మపల్లి,గ్రామంలో ఊరు కు వరప్రదాయినిగా ఉన్నటువంటి మూల వాగు ప్రాజెక్టు అధికారుల పర్యవేక్షణ లోపం నిర్లక్ష్యంతో భారీగా దెబ్బతినడంతో ఎడమ కాలువ వద్ద సుమారు మూడు మీటర్ల లోతు వరకు కట్ట కుంగిపోవడంతో రైతులు గ్రామ ప్రజలు ఆందోళన చెందారు. గత వారం రోజుల క్రితం కురిసిన వర్షాల కు ఎడమ కాలువ తూము వద్ద బుంగపడడంతో స్థానిక రైతులు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. వెంటనే గ్రామస్తులు అధికారులు అక్కడికి చేరుకొని బుంగ పడిన ప్రాంతాన్ని ఇసుక బస్తాలు వేసి కొంతవరకు మరమ్మతులు చేశారు. మంగళవారం కురిసిన కొద్దిపాటి వర్షానికి కట్ట భాగం సుమారు మూడు మీటర్ల లోతు వరకు భారీగా కృంగిపో పోయి ప్రమాదకరంగా మారింది. ములవాగు ప్రాజెక్టుపై ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 9 లో భాగంగా 163 కోట్ల వ్యయంతో 0.276 టిఎంసి నీటి నిల్వ సామర్థ్యంతో ఉండేలా రెండు సంవత్సరాల క్రితం పనులు చేశారు. సంబం ధిత పనులను తూతూ మంత్రంగా మరమ్మతులు చేసారని సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన మూలాగు ప్రాజెక్టును సరిగా దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించకుండా సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేసుకొని ముగించారని నాణ్యత లేని పనులు చేయడం వలన అధికారులు పర్యవేక్షణ కొరవడం తోనే ఇలా జరిగిందని గ్రామ ప్రజలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్యాకేజీ 9 ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో మూలవాగు ప్రాజెక్టు కీలకంగా ఉండటంతో కట్టను పటిష్టంగా దెబ్బతినకుండా నిర్మించాలని లేకపోతే పెద్ద ప్రమాదం జరిగే అవకా శాలు ఉన్నాయని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సంబంధిత అధికారులు అక్కడికి చేరుకొని ప్రస్తుతం మరమ్మతులు చేశారు.



EDITORIAL

# ఉదయనిధి వ్యాఖ్యలపై మళ్లీ వివాదం!

ఏదిపడితే అది మాట్లాడిన తీరుపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. డిప్యూటి సిఎంగా అధికారం వెలగబెడుతూనే సనాతన ధర్మంపై నోరు పారేసుకు న్నాడు. ఇలాంటి వారికి నటుడు ప్రకాశ్ రాజ్ లాంటి వారు చెంచాలుగా ఉన్నారు. తాజాగా ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు తమిళనాట రచ్చరేపాయి. త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యలకు అరెస్టయి, కోర్టు తీర్పుతో బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయినా తన పెడసరం మాటలాను తగ్గించుకుంటా నని అనడం లేదు. డిప్యూటి సిఎంగా పనిచేసిన వ్యక్తి కొంత సంయమ నంగా ఉండాలి.

అధికారంలో ఉంటే పెసరం మాటలు.. రెచ్చగొట్టే ప్రసంగాలు.. సనాతన ధర్మంపై అవాకులు చెవాకులు పేలడం వంటివన్నీ చూశాం. డిఎంకె నేత ఉదయనిధి స్టాలిన్ నేపథ్యం ఇది. ఏదిపడితే అది మాట్లాడిన తీరుపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. డిప్యూటి సిఎంగా అధికారం వెలగబెడుతూనే సనాతన ధర్మంపై నోరు పారేసుకు న్నాడు. ఇలాంటి వారికి నటుడు ప్రకాశ్ రాజ్ లాంటి వారు చెంచాలుగా ఉన్నారు. తాజాగా ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు తమిళనాట రచ్చరేపాయి. త్రిషా కృష్ణన్‌పై చేసిన వ్యాఖ్యలకు అరెస్టయి, కోర్టు తీర్పుతో బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయినా తన పెడసరం మాటలాను తగ్గించుకుంటా నని అనడం లేదు. డిప్యూటి సిఎంగా పనిచేసిన వ్యక్తి కొంత సంయమ నంగా ఉండాలి. అంత మాత్రాన నోటికి ఎంత వస్తే అంత మాట్లాడేస్తా నంటే కుదరదు. తాత కరుణానిధి, తండ్రి స్టాలిన్ సంపాదించిన పొలిటికల్ క్రెడిబిలిటీని వివాదాస్పద వ్యాఖ్యలతో మంటకలిపేయడం లక్ష్యంగా ఉదయనిధి రాజకీయాలు సాగుతున్నాయి. తమిళనాడు రాజకీ య చరిత్రలో నాయకుల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు సర్వసాధా రణం. అయితే రాజకీయ విమర్శల పేరుతో వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లడం ఆందోళన కలిగించే విషయం. ప్రజా సమస్యలపై పోరా డాల్సిన ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆయన ఇమేజ్‌ను దిగజార్చే అవకాశాలున్నాయి. శశికళ నుంచి నేటి త్రిష కామెంట్స్ వరకు ఆయన వ్యవహార శైలి రాజకీయా ల్లో నైతికతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. నిరసనల్లో పొలిటికల్ పాయింట్లు మాట్లాడకుండా వ్యక్తిగత దాడులకు దిగడం సరైన పద్ధతి కాదన్నది అందరూ ముక్త కంఠంతో విమర్శించారు. ఈ తరహా వివాదాస్పద వ్యాఖ్యలు రాబోయే రోజుల్లో డీఎం పార్టీకి ఎలాంటి రాజకీయ మూల్యాన్ని చెల్లించేలా చేస్తాయో వేచి చూడాలి. అయితే రాజకీయాల్లో విమర్శలు సహజమే.. కానీ వ్యక్తిగత స్థాయికి దిగజారి మహిళలపై నోరు పారేసుకోవడం ఉదయ్ నిధి స్టాలిన్ వంటి నేతలకు మాత్రమే సాధ్యమని రుజువు చేసుకున్నారు. నటి త్రిషపై ఆయన చేసిన వ్యాఖ్యలతో తమిళనాడు ఒక్కసారిగా భగ్గుమంది.. అయితే ఇలాంటి మాటలు మాట్లాడటం ఆయనకు కొత్తేవూ కాదు. సనాతన ధర్మంపై ఆ మధ్య నోరు పారేసుకున్న ఉదయనిధి స్టాలిన్, గతం లోనూ నోటికి ఎంతొస్తే అంత మాట్లాడేవారు. తంజావూరులో కావేరి నీటి పంపకాల అంశంపై నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడిన సందర్భంగా ప్రభుత్వ తీరును, ముఖ్య మంత్రి విజయ్‌ను తీవ్రంగా విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం మానేసి డీఎంపై రాజకీయ కక్షసాధింపులకు విజయ్ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. ఉదయనిధి ప్రసంగిస్తున్న సమయంలో డీఎం కార్యకర్తలు నటి త్రిష పేరును నినాదాలుగా చేయడం ప్రారంభించారు. దానికి స్పందించిన ఉదయనిధి మన ప్రాంతానికి నీళ్లు రాకపోయినా పర్లేదు అక్కడ నీళ్లు చేరాలనేది ఆయన ఆలోచన అని డబుల్ వూనింగ్ వచ్చేలా మాట్లాడారు. ఈ వ్యాఖ్యలు సోషల్ వూడియాలో విపరీతంగా వైరల్ అయ్యాయి. మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సహా పలువురు రాజకీయ నాయకులు దీనిని తీవ్రంగా ఖండించారు. ఇలాంటి నీచమైన మాటలతో మహిళలను కించపరిచా రని విమర్శిస్తున్నారు. ఉదయనిధి స్టాలిన్ మహిళలను ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలను లక్ష్యంగా చేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఆయన ఎమ్మెల్యే కాకముందు నుంచి డా వరుస వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 2021 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో అప్పటి ముఖ్యమంత్రి పళనిస్వామిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శశికళ కాళ్లను పట్టుకోవడానికి పళనిస్వామి శవంలా పాకారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రసంగం వీడియో సోషల్ వూడియాలో వైరల్ కావడంతో అన్నాడిఎంకె నాయకులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆయనపై డిఫమేషన్ సు డా నమోదు చేశారు. మహిళా నాయకులను, రాజకీయ ప్రత్యర్థులను దిగజార్చేలా మాట్లాడటం ఆయన శైలిగా మారిం దనే విమర్శలు వచ్చాయి. విజయ్ నేతృత్వంలోని టీవీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉదయనిధి తన వ్యాఖ్యల జోరు తగ్గించలేదు. దీనికితోడు అధికారం కోల్పోవడంతో తట్టుకోలేక పోతున్నాడు. మీడియా సమావేశం లో, తన ఎక్స్ ఖాతా పోస్ట్ ద్వారా ముఖ్యమంత్రి విజయ్‌ను సూటిగా లక్ష్యంగా చేసుకున్నారు. అసెంబ్లీ గౌరవానికి భంగం కలిగించేలా కుట్టి స్టోరీ చెప్పడం తగదని వ్యాఖ్యానించారు. చెంగల్పట్టు కోర్టులో భర్త కోసం వెతుకుతున్న భార్య కథ తమిళనాడు అంతటికీ తెలుసంటూ వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. విజయ్, ఆయన భార్య సంగీత మధ్య ఉన్న వివాదాల ను ఈ రకంగా ప్రస్తావించడంపై టీవీ శ్రేణులు భగ్గుమన్నాయి. మరో సందర్భంలో మాట్లాడిన ఉదయ్ నిధి త్వరలోనే టీవీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ఐటవ్ పాటలకు డాన్సులు చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలు శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. డిఎంకె అధినేత స్టాలిన్ తన కుమారుడిని కంట్రోల్ చేసుకోవాల్సిందే. లేకుంటే ఈ విపరీతాలు ఎంతకైనా దారితీస్తాయి. విమ ర్శలకు అలవాటు పడ్డ ఉదయనిధి ఇకముందు వివాదాలు సృష్టించేలా మాట్లాడకుండా ఉండలేదు. అందువల్ల డిఎంకె అధినేత స్టాలిన్‌ను అదుపులో పెట్టుకోకుంటే మూల్యం చెల్లించడం ఖాయం.

విజయ్, ఆయన భార్య సంగీత మధ్య ఉన్న వివాదాల ను ఈ రకంగా ప్రస్తావించడంపై టీవీ శ్రేణులు భగ్గుమన్నాయి. మరో సందర్భంలో మాట్లాడిన ఉదయ్ నిధి త్వరలోనే టీవీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ఐటవ్ పాటలకు డాన్సులు చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలు శాసనసభ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. డిఎంకె అధినేత స్టాలిన్ తన కుమారుడిని కంట్రోల్ చేసుకోవాల్సిందే. లేకుంటే ఈ విపరీతాలు ఎంతకైనా దారితీస్తాయి. విమ ర్శలకు అలవాటు పడ్డ ఉదయనిధి ఇకముందు వివాదాలు సృష్టించేలా మాట్లాడకుండా ఉండలేదు.



## గురుకులాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చాలి

**కలెక్టర్ అనురాగ్ జయంతి**

**ప్రజానావ, యాదాద్రి భువనగిరి:** ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రాజాపేట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, కళాశాలను సందర్శించిన ఆయన గతంలో సూచించిన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. హాస్టల్ కిటికీలు, తలుపులు, మెష్ ఏర్పాటు, పైకప్పు లీకేజీల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని, బ్లాక్ అయిన మరుగుదొడ్లను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన సందర్భంగా మెనూ ప్రకారం గుడ్లు, చికెన్ సరఫరా జరగడం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో సంబంధిత కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరగతి గదుల్లో ఊడిపోతున్న గోడలు, పైకప్పులను వెంటనే మరమ్మతు చేయాలని సూచించారు. జిల్లాలోని గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందించేందుకు అనుభవజ్ఞుడైన లెక్చరర్ డాక్టర్ రాజును నియమించినట్లు తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువులో రాణించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, ఎంఆర్వో, ఎంపీడీవో నాగవేణి తదితర అధికారులు పాల్గొన్నారు

## భూ రికార్డుల్లో పారదర్శకతే ప్రభుత్వ లక్ష్యం

- భూభారతి పోర్టల్‌పై పూర్తి అవగాహనతో సేవలు అందించాలి
- ప్రజలకు వేగవంతమైన, పారదర్శక భూ సేవలే లక్ష్యం
- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**ప్రజానావ, నాగర్‌కర్నూల్:** భూభారతి పోర్టల్‌పై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకుని ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ రెవెన్యూ శాఖ జూనియర్ అసిస్టెంట్లకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం భూ పరిపాలనలో సంస్కరణలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న భూభారతి పోర్టల్ ద్వారా భూ సంబంధిత సేవలను వేగంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందించేందుకు రెవెన్యూ శాఖ సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లకు భూభారతి పోర్టల్ నిర్వహణ, భూభారతి చట్టం, ఆన్‌లైన్ దరఖాస్తుల పరిశీలన, పరిష్కార విధానంపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత పెంపొందించడం, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సకాలంలో సేవలు అందించడం, భూ వివాదాలను తగ్గించడం లక్ష్యంగా ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను రూపొందించిందన్నారు. ఈ లక్ష్యాల సాధనలో రెవెన్యూ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని సూచించారు. పోర్టల్‌కు సంబంధించిన సందేహాలు తలెత్తినప్పుడు సంబంధిత అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుదారుకు స్లాట్ బుకింగ్, విచారణ తదితర తేదీల వివరాలను ముందుగానే తెలియజేసి వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. భూభారతి పోర్టల్ లాగిన్ వివరాలను అత్యంత గోప్యంగా ఉంచాలని, వాటిని ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. ప్రతి జూనియర్ అసిస్టెంట్ పోర్టల్‌లోని అన్ని మాడ్యూళ్లపై పూర్తి అవగాహన పెంపొందించుకుని భూ సంబంధిత దరఖాస్తులను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. శిక్షణలో భాగంగా భూభారతి చట్టం లోని వివిధ అధికరణలు, వాటి అమలు విధానం, రెవెన్యూ అధికారుల బాధ్యతలు, చట్టపరమైన అంశా లపై సవివరంగా వివరించారు. ప్రస్తుతం భూభారతి పోర్టల్‌లో 13 రకాల మాడ్యూళ్ల ద్వారా భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారం జరుగుతోందని, గతంలో 33 మాడ్యూళ్ల ద్వారా నిర్వహించిన ప్రక్రియను సరళీకృతం చేసి సేవలను మరింత సమర్థవంతంగా మార్చినట్లు తెలిపారు. ప్రతి మాడ్యూల్ పరిధి, దరఖాస్తుల నమోదు, పరిశీలన, ధ్రువీకరణ, అనుమతులు, తిరస్కరణకు గల కారణాలు, ఆన్‌లైన్ ప్రక్రియలో పాటించాల్సిన జాగ్రత్తలను ఉదాహరణలతో వివరించారు. శిక్షణలో పాల్గొన్న జూనియర్ అసిస్టెంట్ల సందేహాలను నివృత్తి చేస్తూ భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని సూచించారు. జిల్లాలో భూ పరిపాలనను మరింత సమర్థవంతంగా మార్చేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు కీలకమని, భూభారతి పోర్టల్‌పై పూర్తిస్థాయి అవగాహనతో పనిచేస్తే భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారం వేగవంతమై ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో బన్సీలాల్, అదనపు కలెక్టర్ చెన్నయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు అశోక్, హర్షవర్ధన్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, రెవెన్యూ శాఖ అధికారులు, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లోని జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ శ్రీనివాసరావు
- నకిలీ పెట్టుబడి ప్రకటనలు, ఉద్యోగాల పేరుతో మోసాలపై హెచ్చరిక
- సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇతరులకూ తెలియజేయాలి



**ప్రజానావ, మెదక్:** సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో పెరుగుతున్నాయని, ప్రజలు డిజిటల్ ప్రపంచంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. జాతీయ 'సైబర్ జాగృత్ దివస్' సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సురక్షా కా తిరంగా—సైబర్ స్వతంత్ర తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సైబర్ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో ప్రతిరోజూ సైబర్ నేరాల కారణంగా ప్రజలు కోట్ల రూపాయలు కోల్పోతున్నారని పేర్కొన్న ఆయన, సోషల్ మీడియాలో వచ్చే నకిలీ స్టాక్ మార్కెట్ పెట్టుబడి ప్రకటనలను నమ్మవద్దని హెచ్చరించారు. మోసగాళ్లు ముందుగా వాట్సాప్ గ్రూపుల్లో చేర్చి నకిలీ లాభాల స్క్రీన్‌షాట్లు, సందేశాలతో నమ్మకం కల్పించి, తొలుత కొద్దిమొత్తం లాభాలు వచ్చినట్లు చూపించి అనంతరం భారీ పెట్టుబడులు పెట్టించి మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. అలాగే ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వివిధ రకాల ఫీజుల పేరుతో డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒకసారి డబ్బు చెల్లించిన తర్వాత వరుసగా కొత్త కొత్త ఫీజుల పేరుతో డబ్బులు వసూలు చేస్తారని, చివరకు భారీగా నష్టపోయిన తర్వాతే బాధితులకు మోసం జరిగిన విషయం తెలుస్తుందని చెప్పారు. ఉద్యోగం ఇచ్చే సంస్థ అభ్యర్థికి జీతం చెల్లిస్తుందని, ఉద్యోగం కోసం అభ్యర్థి నుంచి డబ్బులు ఎందుకు అడుగుతుందో ఆలోచించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు, ఏటీఎం లేదా డెబిట్ కార్డు వివరాలు ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియాలోని ఫేక్ అకౌంట్లు, ఫిషింగ్ లింకులు, తప్పుడు ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడంతో పాటు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంచుకోవడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా సైబర్ నేరాలపై చైతన్యం కల్పించాలని, ప్రతి పౌరుడు బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరుడిగా వ్యవహరించినప్పుడే 'సైబర్ స్వతంత్ర తెలంగాణ' లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో సైబర్ అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు సుభాష్ చంద్రబోస్, ప్రసన్నకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే. హుస్సేన్, డా. టి. మల్లేశం, వి. మురళి, డాక్టర్ ఆర్. శ్రీలత, సైబర్ క్రైమ్ సిబ్బంది సతీష్, సయ్యద్, సాయికిరణ్, స్వప్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆసుపత్రుల్లో నిర్లక్ష్యంపై కఠిన చర్యలు

**జిల్లావ్యాప్తంగా పర్యవేక్షణకు కలెక్టర్ అంకిత్ ఆదేశాలు**

**ప్రజానావ, కొత్తగూడెం:** ప్రభుత్వ ఆసుపత్రు ల్లో రోగుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల ప్రాణాలకు సంబంధించిన వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యాన్ని సహించబోమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. మణుగూరు ఏరియా ఆసుపత్రిలో గడువు ముగిసిన మందుల పంపిణీ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన, సేవల నాణ్యతను దెబ్బతీసే వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆసుపత్రుల్లో మందుల నిల్వలు, గడువు తేదీలు, పంపిణీ విధానంపై అధికారులు నిరంతరం పర్య వేక్షణ చేపట్టాలని, ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని కాపాడటమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి స్థాయిలో సిబ్బంది బాధ్యతాయు తంగా వ్యవహరిస్తూ రోగులకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలని ఆదేశించారు.అలాగే ఒక సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌ను చర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు బదిలీ చేయడంతో పాటు, విచారణ పూర్తయ్యే వరకు ఇద్దరు పేషెంట్ కేర్ సిబ్బంది సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వైద్య సంస్థల్లో సేవల నాణ్యత, మందుల నిల్వలు, రికార్డుల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని జిల్లా వైద్య పరిపాలన విభాగం వెల్లడించింది.



## వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలి

**ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**

**ప్రజానావ, ఖమ్మం:** చమురు, సహజవాయువు రంగాలకు చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని, వినియోగదారులకు నాణ్యమైన, వేగవంతమైన, మెరుగైన సేవలు అందేలా చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర సూచించారు. ఢిల్లీలోని పార్లమెంట్ అనెక్స్ భవనంలో పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయీ సంఘం చైర్మన్ సునీల్ దత్తాత్రే తర్కరే అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. సమావేశంలో వివిధ చమురు సంస్థల ఉన్నతాధికారులతో కలిసి దేశంలో క్రూడాయిల్, సహజవాయువు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ నిల్వల పరిస్థితిని సమగ్రంగా సమీక్షించారు. చమురు ఉత్పత్తుల్లో కల్తీని అరికట్టడం, ప్రమాదాల నివారణ, వ్యర్థాల నియంత్రణకు పాటించాల్సిన భద్రతా ప్రమాణాలపై కూడా సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పర్యవేక్షణ చేపడితేనే వినియోగదారులకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలమని పేర్కొన్నారు.

## కలలు కనండి.. లక్ష్యాలను సాధించండి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- నవోదయ విద్యార్థులకు డిజిటల్ వసతుల వరాలు
- ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, కంప్యూటర్ ల్యాబ్ మంజూరు
- పోటీ తత్వంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని పిలుపు



**ప్రజానావ, సూర్యాపేట:** ప్రతి విద్యార్థి గొప్ప కలలు కని వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. సూర్యాపేటలోని జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులు, ఉపాధ్యాయులతో ముచ్చటిస్తూ విద్యతో పాటు డిజిటల్ బోధన, క్రమశిక్షణ, క్రీడలు విద్యార్థుల సమగ్ర వికాసానికి ఎంతో అవసరమని చెప్పారు. పాఠశాలలో నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చిన కలెక్టర్, ప్రిన్సిపల్ విజ్ఞప్తి మేరకు వెంటనే ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే 10 కంప్యూటర్లతో కూడిన కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ వసతులను సీఎస్ఆర్ నిధులు లేదా జిల్లా నిధులతో త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. అద్దె భవనంలో పాఠశాల కొనసాగుతున్నప్పటికీ విద్యార్థులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సీనియర్—జూనియర్ హౌస్ పోటీల ద్వారా పోటీ తత్వం, క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలని, పదో తరగతి తర్వాత ఏ సబ్జెక్ట్ ఎంచుకున్నా దానిలో నైపుణ్యాలు సాధించే సామర్థ్యాన్ని పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. సరైనది, తప్పు ఏదో నిర్ణయించగల పరిపక్వతను అలవర్చుకో వాలని, విద్యార్థులు కోరిన టేబుల్ టెన్నిస్‌తో పాటు ఇతర క్రీడా సామగ్రి పంపిణీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి సైనిక్ స్కూల్ జ్ఞాపకాలను పంచుకున్న కలెక్టర్, తనతో చదివిన పలువురు ప్రస్తుతం ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో ఉన్నత హోదాల్లో సేవలందిస్తున్నారని, ముగ్గురికి శౌర్య చక్ర పురస్కారాలు కూడా లభించాయని గుర్తు చేశారు. నవోదయ విద్యార్థులు భవిష్యత్తులో డాక్టర్లు, ఇంజినీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగానే కాకుం డా దేశాన్ని నడిపించే నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సీబీఎస్ఈ ప్రమాణాలతో విద్య అందుబాటులోకి రావడం గొప్ప అవకాశమని పేర్కొన్నారు. కోదాడలో నవోదయ విద్యాలయానికి శాశ్వత భవన నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, అకాడమిక్ బ్లాక్, హాస్టళ్లు, క్రీడా మైదానాలు, డైనింగ్ హాల్‌తో కూడిన పూర్తి స్థాయి క్యాంపస్‌ను ఏడాదిన్నరలో అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. తాత్కాలిక భవనంలో పాఠశాల కొనసాగుతున్నప్పటికీ బోధనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఉపాధ్యాయులకు సూచించారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని చదువుతో పాటు కరిక్యులర్, కో—కరిక్యులర్ కార్యక్ర మాల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారికి అందిస్తున్న ఆహార నాణ్యత, మెనూ వివరా లను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్ర మంలో నవోదయ ప్రిన్సిపల్ ఆదినారాయణ, తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిందితుల అరెస్టు కోరుతూ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా

- శ్రీకాంత్ ఆత్మహత్య కేసులో వెంటనే చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యుల డిమాండ్
- ఎఫ్ఐఆర్‌లో పేర్లు ఉన్న వారిని అరెస్టు చేయకపోవడంపై ఆగ్రహం

**ప్రజానావ, టేకులపల్లి:** ప్రేమ వ్యవహారంలో బెదిరింపులు, మానసిక వేధింపుల కారణంగానే గుగులోత్ శ్రీకాంత్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ, కేసులో ఎఫ్ఐఆర్‌లో నమోదైన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు టేకులపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, శ్రీకాంత్ ప్రేమించిన యువతి తన ప్రేమను నిరాకరించిన అనంతరం ఆమెను కలవడానికి లేదా మాట్లాడేందుకు ప్రయత్నిస్తే చంపేస్తామని హనుమ తండాకు చెందిన గుగులోత్ హాము, చీమలపాడుకు చెందిన సచిన్ బెదిరించారని ఆరోపించారు. ఈ బెదిరింపులు, మానసిక వేధింపులను తట్టుకోలేక శ్రీకాంత్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఘటనపై శ్రీకాంత్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినప్పటికీ, ఎఫ్ఐఆర్‌లో పేర్లు ఉన్న నిందితులను ఇప్పటి వరకు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నిందితులను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని బాధిత కుటుంబ సభ్యులు హెచ్చరించారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ

**1930కు వెంటనే ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచన**

**ప్రజానావ, నాగర్‌కర్నూల్:** సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ పిలుపునిచ్చారు. సైబర్ జాగ్రుక్త దివస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో బ్యాంకర్లతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు, సైబర్ క్రైమ్ బాధితులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ మోసాలకు గురైన బాధితులను పరిచయం చేసి వారు ఎలా మోసపోయారో వివరిస్తూ ఇతరులకు అవగాహన కల్పించారు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా వేగంగా పెరుగుతున్నాయని, ప్రజలు ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. లోన్ యాప్‌ల పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసే ముఠాల పట్ల నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నోముల వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్ ఎస్సై గిరి మనోహర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై రామ్‌లాల్, ఆర్‌బీఎస్ఐ రమేష్, జిల్లా సైబర్ క్రైమ్ బృందం సభ్యులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఒడిశాలోని నైనీ గని బొగ్గు రవాణాపై సింగరేణి ఉన్నతస్థాయి సమీక్ష

- రోజుకు కనీసం 12 వేల టన్నుల బొగ్గు రవాణా లక్ష్యంగా చర్యలు
- వినియోగదారులు, రవాణా ఏజెన్సీలతో సింగరేణి ఉన్నతాధికారుల సమావేశం
- అంగూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీతో రవాణా సమస్యలపై చర్చ

**ప్రజానావ, హైదరాబాద్ :** ఒడిశా రాష్ట్రంలోని సింగరేణి నైనీ బొగ్గు గని నుంచి ఉత్పత్తి అవుతున్న బొగ్గును రైల్వే సైడింగ్‌తో పాటు వినియోగదారులకు లక్ష్యాల మేరకు ప్రతిరోజూ సరఫరా చేయడంపై సింగరేణి ఉన్నతాధికారులు నైనీ గని వద్ద ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సింగరేణి డైరెక్టర్ (పర్సనల్ అండ్ ఫైనాన్స్) గౌతమ్ పోట్రు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జిందాల్ స్టీల్, జిందాల్ ఇండియా పవర్ లిమిటెడ్, మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్, తమిళనాడు పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతినిధులతో పాటు బొగ్గు రవాణా ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. నైనీ గని నుంచి ఏటా 60 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి కానుండగా, సమీప విద్యుత్ కేంద్రాలతో పాటు తెలంగాణలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్, తమిళనాడు విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. రోజువారీ లక్ష్యాల మేరకు బొగ్గు రవాణా జరిగేలా రవాణా ఏజెన్సీలు, వినియోగదారులు సమన్వయంతో పనిచేయాలని డైరెక్టర్ గౌతమ్ పోట్రు సూచించారు. హిందోల్ రైల్వే సైడింగ్, కామాఖ్య నగర్ సైడింగ్ వరకు రైలు మార్గంలో బొగ్గు రవాణా సజావుగా జరిగేందుకు పూర్తి సహకారం అందించాలని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి. వెంకన్న కోరారు. దీనికి వినియోగదారులు, రవాణా సంస్థలు సానుకూలంగా స్పందించి రోజువారీ కేటాయింపుల మేరకు బొగ్గు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. బొగ్గు రవాణా మార్గంలో ఎదురవుతున్న సమస్యలపై అంగూల్ జిల్లా కలెక్టర్ ఎం. అబ్దుల్ అక్తర్, జిల్లా ఎస్పీ రాహుల్ జైన్‌తో సింగరేణి ఉన్నతాధికారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రోడ్డు మార్గంలో బొగ్గు రవాణాకు ప్రభుత్వ యంత్రాంగం సహకారం అందించాలని కోరగా అధికారులు సానుకూలంగా స్పందించారు. రోజుకు కనీసం 12 వేల టన్నుల బొగ్గు రవాణా లక్ష్యంగా సింగరేణి యాజమాన్యం కార్యాచరణ చేపట్టింది. అంతకుముందు డైరెక్టర్ గౌతమ్ పోట్రు, ఈడీ బి. వెంకన్న నైనీ గనిని సందర్శించి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. సమావేశంలో నైనీ ఏరియా జనరల్ మేనేజర్ డి. బైద్యతో పాటు ఇతర సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

## బాల్క సుమన్‌ని కలిసిన కోటపల్లి బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు



**ప్రజానావ, మంచిర్యాల :** హైదరాబాద్ లోని బంజారాహిల్స్‌లో చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ బాల్క సుమన్‌ను బుధవారం కలిసి ఆశీర్వాదం తీసుకున్న కోటపల్లి మండల బిఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షులు ఆసంపెల్లి సంపత్ కుమార్, హైదరాబాద్ లో బంజారాహిల్స్ సుమన్ తమ నివాసంలో కలసి తమ పుట్టిన రోజు సందర్భంగా ఆశీర్వాదం తీసుకున్న మలిదశ విద్యార్థి ఉద్యమ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులు ఆసంపెల్లి సంపత్ కుమార్, ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ యువ నాయకులు తుంగపిండి శేఖర్, శనిగరాపు సుమన్, ఆసంపెల్లి రవీందర్, చకినారపు అజయ్, ప్రసాద్ రాచర్ల బిట్టు, కుందారపు విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ సీట్ల భర్తీకి జీడీసీలో స్పెషల్ ఫేజ్ ప్రారంభం




**ప్రజానావ, పెద్దపల్లి :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను దోస్త్ అడ్మిషన్ ప్రక్రియలో భాగంగా ఇంకా ఖాళీగా మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు స్పెషల్ ఫేజ్ ప్రక్రియను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కే. లక్ష్మీ నరసయ్య తెలిపారు. ఖాళీగా ఉన్నా సీట్ల వివరాలు ప్రకటిస్తూ బీకాం (బిఎఫ్ఎస్ఐ), బి జెడ్ సి (లైఫ్ సైన్సెస్), బీఎస్సీ( ఎంపీసీఎస్), బి.ఏ కోర్సులలో ఖాళీలు ఉన్నట్లుగా తెలిపారు. స్పెషల్ ఫేజ్ అడ్మిషన్స్ ప్రక్రియ ఆగస్టు 6 నుండి 11 వరకు కొనసాగుతుందని, ఇంటర్మీడియట్ విద్య ఉత్తీర్ణత అయి డిగ్రీ ప్రవేశాల కోసం ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశం అని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దపెల్లిలో ప్రవేశం పొందాలని సూచించారు. ప్రవేశాల కోసం విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవాల్సిందిగా లేదా దోస్త్ అధికారిక వెబ్సైట్ను సంప్రదించాలని తెలిపారు.

## కేయూలో స్టూడెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు విశేష స్పందన

- వ్యవస్థాపక దృక్పథం పెంపొందించడమే లక్ష్యం
- స్టార్టప్‌ల స్థాపనకు అవసరమైన ప్రాథమిక అంశాలపై విద్యార్థులకు అవగాహన

**ప్రజానావ, వరంగల్:** కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)లోని కే–హబ్ ఆధ్వర్యంలో, టీ–హబ్ సహకారంతో నిర్వహించిన స్టూడెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్‌డీపీ) తొలి సెషన్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో నిర్వహిం చిన ఈ కార్యక్రమంలో సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి టీ–హబ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మెంటర్ మనోజ్ ముఖ్య వక్తగా హాజరై వ్యవస్థాపకత (ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్) ప్రాధాన్యత, స్టార్టప్‌ల ప్రాథమిక సూత్రాలు, ఆలోచన నుంచి వాణిజ్యీకరణ (కాన్సెప్ట్ టు కమర్షియలైజేషన్), వ్యాపార ఆలోచనల ధ్రువీకరణ (ఐడియా వాలిడే షన్) వంటి కీలక అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పిం చారు. వినూత్న ఆలోచనలను విజయవంతమైన వ్యాపారాలుగా మలచేం దుకు అనుసరించాల్సిన విధానాలను వివరించి, స్టార్టప్‌ల రంగంలో ఉన్న అవకాశాలను విద్యార్థులకు వివరించారు. అటల్ ఇన్నోవేషన్ మిషన్ (నీతి ఆయోగ్), టీ–హబ్, బీవీఐసీ, ఏఎల్ఈఏపీ–ఏఐసీ, ఏఐసీ–ఎస్ఎన్‌జీ ఏఎం, యూఎన్ఐడీఓ–ఎఫ్ఎల్‌సీటీడీ యాక్సిలేటర్‌తో పాటు పలు స్టార్టప్ ఇంక్యుబేటర్లు, విద్యాసంస్థల్లో మెంటర్‌గా పనిచేస్తున్న మనోజ్ తన అనుభవాలను విద్యార్థులతో పంచుకుని, ఆవిష్కరణలకు ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కే–హబ్ డైరెక్టర్ ప్రొఫెసర్ టి. సవితా జ్యోత్స్న, కోఆర్డినేటర్లు సిద్ధార్థ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో వ్యవస్థాపక దృక్పథాన్ని పెంపొందించడం, ఆవిష్కరణాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం అందించడం, భవిష్యత్తులో స్టార్టప్‌ల స్థాపనకు అవసరమైన ప్రాథమిక అవగాహన కల్పించడమే ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## సైబర్ మోసాలకు ఫుల్ స్టాప్ పలుకుదాం

- కలిసి సైబర్ సురక్షిత తెలంగాణను నిర్మిద్దాం
- సోషల్ మీడియా వేదికగా వచ్చే పెట్టుబడి, జాబ్ సందేశాలు చూసి మోసపోవద్దు
- జిల్లా ఎస్పీ మహేష్ బీ. గీతే
- విద్యార్థులతో కలసి పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ



**ప్రజానావ, సిరిసిల్ల :** విద్యార్థి దశ నుండే సైబర్ మోసాలకు ఫుల్ స్టాప్ పలికి కలిసి సైబర్ సురక్షిత తెలంగాణను నిర్మిద్దాం అని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఆగస్టు – 2026 స్వాతంత్ర్య మహోత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ వరకు విద్యార్థులతో కలిసి సైబర్ అవగాహన ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడు తూ...సైబర్ మోసాల పట్ల ప్రజలను, విద్యార్థులను అప్రమత్తం చేసి, సురక్షితమైన డిజిటల్ వినియోగంపై చైతన్యం కల్పించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, విద్యా సంస్థల్లో విస్తృత స్థాయిలో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసగిస్తున్నారని, అత్యాశకు లోనై వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పవద్దని సూచించారు. సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తతే ప్రధాన ఆయుధమని, అవగాహన ద్వారానే సైబర్ మోసాలను సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ తదితర వేదికల ద్వారా వచ్చే పెట్టుబడి, జాబ్ ఆఫర్లు, ముఖ్యంగా స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో చేసే మోసాలు, డిజిటల్ అరెస్ట్ అంటూ వచ్చే ఫోన్ కాల్స్, లోన్ యాప్స్, మొదలగు మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలు వచ్చిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా ద్వారా అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింకులు, స్నేహ అభ్యర్థనలకు స్పందించవద్దని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం ఎవరితో పంచుకోవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే, ముఖ్యంగా గోల్డెన్ అవర్ (మొదటి గంట)లోనే 1930 సైబర్ హెల్ప్‌లైన్కు కాల్ చేసి లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ శ్రీనివాస్, ఎస్ఐ లు గణేష్, నాగరాజు, జునైద్, సైబర్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుతో రైతుల్లో ఆనందం

**అంచనాలను మించిన దిగుబడులు, మంచి ఆదాయం**

**ప్రజానావ, పెద్దపల్లి :** మండలంలోని తుర్కల మద్దికుంట గ్రామంకు చెందిన ఆయిల్ పాం రైతు కీర్తి శ్రీనివాస్ ఆయిల్ పాం తోటలో మొదటి కోత నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు మంచి దిగుబడులు, ఆశాజనకమైన ఆదాయం లభిస్తుండటంతో రైతుల్లో ఆనందం నెలకొంది. రైతులు ఊహించిన దానికంటే మెరుగైన రాబడులు పొందుతూ ఆయిల్‌పామ్ సాగుపై మరింత ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తూ రైతులకు వివిధ రకాల రాయితీలు, సబ్సిడీలను అందిస్తోందన్నారు. రైతులు ప్రస్తుత వర్షపాతాన్ని మాత్రమే నమ్ముకుని అధిక నీటి అవసరం ఉన్న వరి సాగు వైపు వెళ్లకుండా, భవిష్యత్‌లో స్థిరమైన ఆదాయాన్ని అందించే ఆయిల్‌పామ్ వంటి పంటల వైపు దృష్టి సారించాలన్నారు. ఆయిల్‌పామ్ అన్ని రకాల వాతావరణ పరిస్థితులను తట్టుకుని నిలబడగల పంట. ఆయిల్‌పామ్ తోటల్లో కూరగాయలు, పప్పుజాతి పంటలు, మొక్కజొన్న, పత్తి తదితర అంతర పంటలను సాగు చేసుకోవడం ద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందవచ్చు అన్నారు. పెద్దపల్లి జిల్లా పరిపాలన ప్రత్యేకంగా ఆయిల్‌పామ్ సాగు చేపట్టే ఒంటరి మహిళా రైతులకు



అండగా నిలుస్తోంది. వారికి సాగు ఖర్చులను ఉచితంగా భరించడంతో పాటు, ఉద్యానశాఖ ద్వారా అందించే సబ్సిడీలను కూడా అందిస్తూ ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు రూ.23,488 గా ఉంది. ఆయిల్‌పామ్ తోటలో సాధారణంగా నాలుగో సంవత్సరం నుంచి మొదటి దిగుబడి ప్రారంభమవుతుంది. ఆయిల్‌పామ్ తోటలు 7వ సంవత్సరం వరకు ఎకరాకు సంవత్సరానికి సుమారు 6 నుంచి 8 టన్నుల దిగుబడిని ఇవ్వగలవు. ఆ తరువాత దిగుబడి ఎకరాకు సంవత్సరానికి 10 నుంచి 12 టన్నుల వరకు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుత ధరలను పరిగణనలోకి తీసుకుంటే రైతులకు ఎకరాకు సంవత్సరానికి సుమారు రూ.1.80 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఆదాయం లభించే అవకాశం ఉంది. అంటే నెలకు సగటున రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఎకరాకు ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. అందువల్ల రైతులు ఎలాంటి సందేహాలు, అనుమానాలు లేకుండా ఆయిల్‌పామ్ సాగును చేపట్టాలని, ఇది దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే పంటగా నిలుస్తుందని పెద్దపల్లి జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమం లో గడ్డం శ్యామ్ ప్రసాద్,జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి, పెద్దపల్లి, తిరుమల ఆయిల్ పాం కంపెనీ సీఈవో కేషు కల్యాంకర్, హెచ్ఈఓ రాము, ఆయిల్ పాం ఫీల్డ్ స్టాఫ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద చెరువు వద్ద భద్రతా చర్యలు ముమ్మరం

- భారీ వర్షాల నేపథ్యంలో ఎస్పీ రాజేష్ చంద్ర పరిశీలన
- ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశం

**ప్రజానావ, కామారెడ్డి:** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కామారెడ్డి పట్టణంలోని పెద్ద చెరువును జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర పరిశీలించారు. చెరువులోకి భారీగా చేరుతున్న వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ఆయన, ప్రజల భద్రతకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువు పరిసర ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ప్రజలు చెరువు వద్దకు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు, బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, కామారెడ్డి టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీహరి, కామారెడ్డి రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, దేవునిపల్లి ఎస్ఐ రంజిత్, పోలీసు సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**ప్రజానావ, గంభీరావుపేట:** తల్లిపాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్లు కళావతి, స్వరూప లు అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గంభీరావుపేట మండలం లింగన్నపేట సెక్టర్ పరిధిలోని ముచ్చర్ల, మల్లారెడ్డిపేట, సముద్రా లింగాపూర్, దేశాయిపేట గ్రామాలలో బుధవారము తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. శిశువు జన్మించిన గంటలోపు తల్లిపాలు పట్టించాలని తల్లిపాల తో శిశువుకు సంపూర్ణ ఆహారం చేకూరుతుందని వివరించారు. ప్రతి తల్లి పుట్టిన తన బిడ్డకు ఆరు నెలలపాటు తల్లిపాలు పట్టించాలని సూచించారు. తల్లిపాలలో ఉన్న పోషక విలువలు, తద్వారా నివారించే రోగనిరోధక శక్తులను అవగాహన కల్పించారు. బిడ్డకు తల్లిపాలు పట్టకపోవడం ద్వారా కలిగే నష్టాలను వివరించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రసన గావించారు. వివిధ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్ లతోపాటు అంగన్వాడీ టీచర్లు ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగాను విజయవంతం చేయాలి

- బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి
- జిల్లా, మండలాల బాధ్యుల ప్రత్యేక సమీక్ష సమావేశం



**ప్రజానావ, సిరిసిల్ల :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు, గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, మోర్చాల అధ్యక్షులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ ఆసాని రామలింగారెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి పాల్గొని కార్యక్రమ నిర్వహణపై విస్తృతంగా దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ, ప్రతి భారతీయునిలో దేశభక్తి భావాన్ని మరింత బలోపేతం చేయడమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లక్ష్యమని అన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా తీసుకొని ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేసేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణకు సంబంధించి కార్యాచరణను ప్రకటించారు. ఆగస్టు 6, 7 తేదీలలో అన్ని మండలాల్లో మండల స్థాయి సమావేశాల నిర్వహణ తో రోజువారి కార్యక్రమా లు ప్రకటించారు. సమావేశం అనంతరం, బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎక్స్–సర్వీస్‌మెన్ సెల్ కన్వీనర్ పవన్ కుమార్ ను జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. దేశ రక్షణలో మాజీ సైనికులు అందించిన సేవలు దేశానికి గర్వకారణమని కొనియాడుతూ, సమాజ సేవలోనూ వారి పాత్ర ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పవన్ కుమార్ కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, సన్మానం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు లింగంపల్లి శంకర్, పార్లమెంట్ కో–కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు బండ మల్లేశం, మల్లారపు సంతోష్ రెడ్డి, బర్కం లక్ష్మి , జిల్లా అధికార ప్రతినిధి నవీన్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మీసం సంజీవ్, బుగ్గారెడ్డి, గొప్పడి సురేందర్ రావు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు జిల్లా ఆఫీసు ఇన్చార్జి భాగన్న , జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ జూకంటి అఖిల్, పల్లం అన్నపూర్ణ, సెన్సార్ బోర్డు సభ్యురాలు వేముల వైశాలి, జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ డా. సత్యనారాయణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాకేష్ రామచంద్రం, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తతే రక్షణ

- సామాజిక మాధ్యమాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి
- సైబర్ భద్రతపై అవగాహన పెంపే లక్ష్యంగా ఎన్ఐటీలో జాగ్రూకత దివస్ కార్యక్రమం

**ప్రజానావ, హనుమకొండ:** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, సామాజిక మాధ్యమాల వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి పిలుపునిచ్చారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ సహకారంతో ఎన్ఐటీ వరంగల్‌లో నిర్వహించిన 'సైబర్ జాగ్రూకత దివస్' అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సీపీ ఎన్. శ్వేత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబర్ నేరస్థులు ప్రధానంగా భయం, ఆశ,




అత్యవసరత అనే మూడు భావోద్వేగాలను ఆసరాగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అనుమానాస్పద సందేశాలు, కాల్స్ లేదా లింకులు వచ్చిన వెంటనే స్పందించకుండా ముందుగా వాటి నిజానిజాలను ధృవీకరించుకుని నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎన్ఐటీ వరంగల్‌లో కృత్రిమ మేధస్సు ఆధారిత సైబర్ భద్రత పరిశోధనలు జరుగుతుండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ సైబర్ భద్రతపై అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరమని పేర్కొన్నారు. సైబర్ నేరాల నివారణకు సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో త్వరలో ఎన్ఐటీ వరంగల్‌లో సైబర్ సెక్యూరిటీ హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కృత్రిమ మేధస్సు ఆధారిత సైబర్ భద్రత, డీప్‌ఫేక్ గుర్తింపు వంటి కీలక రంగాల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు. ఎన్ఐటీ రిజిస్ట్రార్ సునీల్ మెహతా మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా సైబర్ భద్రతకు సంబంధించిన కార్యక్రమాలకు సంస్థ పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. ఎన్ఐటీ పూర్వ విద్యార్థిని, డీసీపీ దారా కవిత మాట్లాడుతూ సైబర్ మోసాల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్న సేవలపై వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆదివాసీలపై ఫారెస్ట్ అధికారులు దాడులు ఆపాలి

**ప్రజానావ, మంచిర్యాల:** మంచిర్యాల జిల్లా సిపిఎం ఆఫీసులో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో బోడెంకి చందు సిపిఎం జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ... జిల్లాలో ఆదివాసీ, పెదాలపై ఫారెస్ట్ దాడులు ఆపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోమాస ప్రకాష్ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, ప్రేమ్ కుమార్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, సిపిఎం నాయకులు పాయిరాల రాములు, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత్‌కు ఆఫ్రికా ప్రాధాన్య భాగస్వామి

- ప్రపంచ పురోగతికి భారత్–ఆఫ్రికా ఉమ్మడి శక్తి
- ఐరాస భద్రతా మండలిలో ఆఫ్రికాకు సముచిత ప్రాతినిధ్యం అవసరం
- త్వరలో ఐఏఎఫ్ఎస్–4 సదస్సు నిర్వహణకు సన్నాహాలు
- విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్



**న్యూఢిల్లీ:** ఆఫ్రికా భారత్‌కు అత్యంత ప్రాధాన్య భాగస్వామి అని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ప్రపంచంలో బహుళధ్రువ వ్యవస్థ ఏర్పడాలన్నా, ఐక్యరాజ్యసమితి సంస్కరణలు ఫలప్రదంగా అమలుకావాలన్నా ఆఫ్రికాకు అంతర్జాతీయ వేదికలపై తగిన ప్రాతినిధ్యం కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఆఫ్రికా డే–2026 సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఎబోలా వైరస్ వ్యాప్తి కారణంగా వాయిదా పడిన నాలుగో భారత్–ఆఫ్రికా ఫోరం సదస్సు (ఐఏఎఫ్ఎస్–4)ను పరస్పర అనుకూల సమయంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని జైశంకర్ తెలిపారు. ఈ అంశంపై ఆఫ్రికన్ యూనియన్‌తో నిరంతరం సంప్రదింపులు కొనసాగుతున్నాయని చెప్పారు. భారత్, ఆఫ్రికా దేశాలు కలిసి ప్రపంచ జనాభాలో కీలక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయని, నవకల్పన, సుస్థిర అభివృద్ధి, పరస్పర సహకారంతో ప్రపంచ పురోగతికి ఈ రెండు ప్రాంతాలు ఉమ్మడి శక్తిగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి, ప్రకృతి విపత్తులు, మానవతా సంక్షోభాలు వంటి ప్రతి క్లిష్ట సమయంలో భారత్ ఆఫ్రికా దేశాలకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. వసుధైవ కుటుంబకం భారత తత్వానికి, ఉబుంటు అనే ఆఫ్రికా జీవన తత్వానికి ఒకే మానవతా స్ఫూర్తి ఉందన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో 17 కొత్త భారత దౌత్య కార్యాలయాలను ప్రారంభించడం ద్వారా ప్రస్తుతం 46 ఆఫ్రికా దేశాల్లో శాశ్వత దౌత్య ప్రాతినిధ్యం కల్పించినట్లు జైశంకర్ తెలిపారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఆఫ్రికాకు సముచిత స్థానం కల్పించాలన్న భారత వైఖరి దృఢంగా కొనసాగుతోందని, అదే విధంగా భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించే అంశంలో ఆఫ్రికా దేశాల మద్దతును కోరారు.

### కీలక రంగాల్లో భాగస్వామ్యం విస్తరణ

భారత్, ఆఫ్రికా దేశాల మధ్య చారిత్రక, సాంస్కృతిక బంధాలు మరింత బలపడుతున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. ఆహార భద్రత, సముద్ర భద్రత, శాంతి పరిరక్షణ, సామర్థ్యాభివృద్ధి, సముద్ర సహకారం వంటి కీలక రంగాల్లో పరస్పర భాగస్వామ్యాన్ని మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. యువశక్తి, సహజ వనరులు, పారిశ్రామిక అవకాశాలతో ఆఫ్రికా వేగంగా అభివృద్ధి చెందుతోందని, భారత్–ఆఫ్రికా భాగస్వామ్యం గ్లోబల్ సౌత్‌కు మరింత బలాన్ని చేకూర్చి ప్రపంచ అభివృద్ధికి కొత్త దిశను చూపుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# మోదీ పోస్టు తొలగింపుపై మెటా క్షమాపణ

- ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో మెటా గ్లోబల్ బృందం భేటీ
- లోపాలను అంగీకరించిన సంస్థ
- బాలల లైంగిక దుర్వినియోగ కంటెంట్, డీప్‌ఫేక్‌లపై కేంద్రం తీవ్ర ఆందోళన



**న్యూఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ ఫేస్‌బుక్ పోస్టును తాత్కాలికంగా తొలగించిన ఘటనపై మెటా సంస్థ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ క్షమాపణలు తెలిపినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ అంశంతో పాటు కంటెంట్ మోడరేషన్‌లో జరిగిన లోపాలపై కూడా విచారం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నాయి. బుధవారం కేంద్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో మెటా గ్లోబల్ వ్యవహారాల అధిపతి జోయెల్ కప్లాన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశమైంది. సమావేశంలో బాలల లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్, డీప్‌ఫేక్‌లు, ప్రముఖుల ధృవీకరించిన ఖాతాల భద్రత, అల్గోరిథమ్ పక్షపాతం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం మెటాను ప్రశ్నించినట్లు సమాచారం. కంటెంట్ నిర్వహణలో లోపాలు జరిగాయని, కొన్ని రకాల కంటెంట్‌ను విస్తృతంగా ప్రచారం చేసేందుకు భారీగా చెల్లింపులు జరిగిన విషయాన్ని కూడా మెటా ప్రతినిధులు అంగీకరించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

### తటస్థ వేదిక కాదని కేంద్రం స్పష్టం

భారత సమాచార సాంకేతిక చట్టం ప్రకారం మెటా తటస్థ మధ్యవర్తి (ఇంటర్మీడియరీ)గా చెప్పుకోలేదని కేంద్రం స్పష్టం చేసింది. సంస్థ అల్గోరిథమ్‌లు వినియోగదారులకు ఏ కంటెంట్ చూపించాలో నిర్ణయిస్తున్నందున కేవలం వేదికగా మాత్రమే వ్యవహరిస్తోందని చెప్పడం సరికాదని తెలిపింది. అందువల్ల ఇంటర్మీడియరీలకు లభించే చట్టపరమైన రక్షణ మెటాకు వర్తించదనే అభిప్రాయాన్ని ప్రభుత్వం వ్యక్తం చేసినట్లు సమాచారం.

### మళ్లీ వివరణకు పిలుపు

జులై 23న పేపర్ లీకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తూ ప్రధాని మోదీ చేసిన ఫేస్‌బుక్ పోస్టును మెటా తొలగించి, అనంతరం సాంకేతిక లోపం కారణమని వివరణ ఇస్తూ పునరుద్ధరించింది. అయితే ఈ వివరణతో ప్రభుత్వం సంతృప్తి చెందలేదు. ఇది కేవలం సాంకేతిక సమస్య మాత్రమే కాదని, జాతీయ భద్రత, శాంతిభద్రతలకు సంబంధించిన అంశమని స్పష్టం చేసింది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో చెల్లింపు ప్రకటనల రూపంలో బాలల లైంగిక దుర్వినియోగానికి సంబంధించిన కంటెంట్ కనిపించిన వ్యవహారంపైనా మెటాకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సంస్థను మరోసారి వివరణ కోసం పిలిచే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## జుకర్‌బర్గ్‌కు పార్లమెంటరీ కమిటీ నోటీసు

- మూడు రోజుల్లో క్షమాపణ చెప్పాలని ఆదేశం
- లేదంటే చట్టపరమైన రక్షణ ఉపసంహరణకు హెచ్చరిక
- గూగుల్ ఇండియాపైనా చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచన

ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగానికి సంబంధించిన వీడియోను ఫేస్‌బుక్ నుంచి తాత్కాలికంగా తొలగించిన ఘటనపై మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్‌కు పార్లమెంటరీ స్థాయి సంఘం క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. మూడు రోజుల్లోగా క్షమాపణలు చెప్పకపోతే ఆయనకు ప్రస్తుతం ఉన్న చట్టపరమైన రక్షణలు, మినహాయింపులను ఉపసంహరించే అంశాన్ని పరిశీలిస్తామని హెచ్చరించింది. లోక్‌సభ సచివాలయ డైరెక్టర్ ఎ. జ్యోతిర్మయి సంతకంతో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ కార్యదర్శికి పంపిన లేఖలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. పరీక్షల అక్రమాలు, పేపర్ లీకులపై కఠిన చర్యల గురించి విద్యార్థులు, యువతను ఉద్దేశించి ప్రధాని మోదీ చేసిన వీడియోను ఫేస్‌బుక్ 5–6 గంటలపాటు తొలగించడం అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నట్లు కమిటీ తెలిపింది.

### గూగుల్‌పైనా చర్యలు కోరిన కమిటీ

హైదరాబాద్ సైబర్ పోలీసులు గూగుల్ ఇండియా అధిపతిని సైబర్ మోసాల కేసులో సహ నిందితుడిగా చేర్చిన అంశాన్ని కూడా కమిటీ ప్రస్తావించింది. మోసపూరిత యాప్‌ల ద్వారా పెట్టుబడులు పెట్టి రూ.48 లక్షలకు పైగా నష్టపోయిన బాధితుల ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని, గూగుల్ ఇండియాపై కూడా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కమిటీ సూచించింది.

# జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలి

- ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి పూర్తి రాజ్యాంగ అధికారాలివ్వాలి
- కేంద్రానికి కాంగ్రెస్ డిమాండ్

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదాను వెంటనే, ఎలాంటి షరతులు లేకుండా పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి పూర్తి రాజ్యాంగ అధికారాలు కల్పించాలని, భూములు, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానికులకు రాజ్యాంగబద్ధ రక్షణలు కొనసాగించాలని కోరింది. దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థ, సమాఖ్య స్ఫూర్తిని కేంద్ర ప్రభుత్వం గౌరవించాలని స్పష్టం చేసింది. ఆర్టికల్ 370 రద్దు చేసి, జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించి ఏడేళ్లు పూర్తయినా పూర్తి రాష్ట్ర హోదా ఇంకా పునరుద్ధరించలేదని కాంగ్రెస్ ఆరోపించింది. జమ్మూకశ్మీర్ వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి సయ్యద్ నాసిర్ హుస్సేన్ విడుదల చేసిన ప్రకటనలో ఈ విమర్శలు చేశారు.

### ఎన్నికలతోనే సరిపోదు

పునర్విభజన, నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్), అసెంబ్లీ ఎన్నికలు వంటి ప్రక్రియలు పూర్తయ్యాయని, కానీ రాష్ట్ర హోదా పునరుద్ధరణ మాత్రమే నిరవధికంగా వాయిదా పడిందని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రస్తుతం ఎన్నికైన ప్రభుత్వం పేరుకే అధికారంలో ఉందని, వాస్తవ అధికారాలు లెఫ్టినెంట్ గవర్నర్ చేతుల్లోనే ఉన్నాయని పేర్కొంది. ఇది సమాఖ్య వ్యవస్థకు విరుద్ధమని విమర్శించింది. జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష ఎంపీలు బుధవారం పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టారు.

# కోర్టు విచారణలపై వార్తలకు ఎలాంటి ఆంక్షలు లేవు

- న్యాయ విచారణలను యథావిధిగా నివేదించవచ్చన్న సుప్రీం
- ఆడియో, వీడియో క్లిప్‌ల వినియోగంపైనే తాత్కాలిక పరిమితులు
- జులై 24 ఉత్తర్వులపై స్పష్టత ఇచ్చిన ధర్మాసనం



**న్యూఢిల్లీ:** కోర్టు విచారణలపై వార్తా సంస్థలు ఎలాంటి సందేహం లేకుండా వార్తలు ప్రచురించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇటీవల జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను మీడియా కథనాలపై పూర్తి నిషేధంగా భావించాల్సిన అవసరం లేదని పేర్కొంది. అయితే కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియో క్లిప్‌లను మాత్రం అనుమతి లేకుండా వార్తల్లోనూ, ఇతర డిజిటల్ వేదికల్లోనూ ఉపయోగించరాదని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం జులై 24న ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై ఇంకా కొంత సందిగ్ధత కొనసాగుతున్న నేపథ్యంలో ఈ వివరణ ఇచ్చింది. గుర్తింపు పొందిన వార్తా సంస్థలు కోర్టు విచారణలు, న్యాయ పరిణామాలు, తీర్పులపై యథావిధిగా వార్తలు అందించవచ్చని, అయితే విచారణల ఆడియో, వీడియో రికార్డింగ్‌లను వార్తా కథనాల్లో ఉపయోగించకూడదని పేర్కొంది. జులై 24 ఉత్తర్వుల ప్రకారం సుప్రీంకోర్టు లేదా సంబంధిత హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్/సెక్రటరీ జనరల్ ముందస్తు అనుమతి లేకుండా కోర్టు విచారణల ఆడియో, వీడియో రికార్డింగ్‌లను సేకరించడం, మార్పులు చేయడం, ప్రచారం చేయడం, సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం, మళ్లీ పోస్టు చేయడం లేదా ఆర్థిక ప్రయోజనాల కోసం వినియోగించడం నిషేధితమని ధర్మాసనం మరోసారి గుర్తు చేసింది.

### పిటిషన్‌పై కేంద్రానికి నోటీసులు

ఈ అంశంపై జర్నలిస్టు హర్షిత గ్రోవర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వంతో పాటు పలు సామాజిక మాధ్యమ వేదికలకు నోటీసులు జారీ చేసింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపిస్తూ, ఈ అంశం అత్యంత ప్రాధాన్యమైనదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

## నిరసనల్లో పోలీసులు సంయమనం పాటించాలి

- రాళ్లు రువ్వినా యువతకు కౌన్సెలింగ్ అవసరం
- చలో సంసద్ పిటిషన్‌పై విచారణకు సుప్రీం అంగీకారం

నిరసనల సందర్భంగా పోలీసులు అత్యంత సంయమనంతో వ్యవహరించాలని, యువత హింసాత్మక చర్యలకు పాల్పడకుండా కౌన్సెలింగ్ ద్వారా శాంతింపజేయాలని సుప్రీంకోర్టు సూచించింది. కొంతమంది రాళ్లు రువ్వినా దానికి ప్రతిగా కఠిన చర్యలు పరిస్థితిని మరింత ఉద్రిక్తం చేసే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించింది. జులై 20న జరిగిన చలో సంసద్ ర్యాలీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరిన పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలకు ప్రాధాన్యం ఉందని పేర్కొన్న ధర్మాసనం, చట్ట అమలు సంస్థలు వివేకంతో వ్యవహరించాలని సూచించింది. ర్యాలీ నిర్వాహకుల బాధ్యతను నిర్ధారించాలని పిటిషనర్ కోరగా, ఈ వ్యాజ్యాన్ని ఇదే అంశంపై పెండింగ్‌లో ఉన్న మరో పిటిషన్‌తో కలిపి విచారించనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

# పార్లమెంట్ ప్రతిష్ఠంభన వీడేదెప్పుడు?

- రాహుల్ గాంధీతో కిరణ్ రిజిజు భేటీ
- నీట్ ఆందోళనలు, అయోధ్య రామాలయ విరాళాల అంశంపై ప్రకటన కోరిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కొనసాగుతున్న ప్రతిష్ఠంభనకు తెరదించేందుకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు బుధవారం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో కీలక సమావేశం నిర్వహించారు. దాదాపు 50 నిమిషాల పాటు సాగిన ఈ భేటీలో మిగిలిన సమావేశాలను సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని రిజిజు కోరగా, కాంగ్రెస్ నుంచి ఎలాంటి హామీ లభించలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. సమావేశంలో సరిహద్దుల పునర్విభజన (డిలిమిటేషన్) బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లు అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. అయితే ప్రస్తుత సమావేశాల కాలాన్ని పొడిగించడం లేదా ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం వంటి ప్రతిపాదనలను రిజిజు ప్రస్తావించలేదని తెలుస్తోంది. ఆగస్టు 13 వరకు సమావేశాలకు ఇంకా సమయం ఉండటంతో ప్రస్తుతం ప్రత్యేక సమావేశాల అవసరం లేదనే అభిప్రాయాన్ని ప్రభుత్వం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

### కాంగ్రెస్ షరతులివే..

రాహుల్ గాంధీతో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, ఉపనేత గౌరవ్ గొగోయ్, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి వ్యతిరేకంగా ఆందోళన చేసిన విద్యార్థులపై పోలీసుల చర్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలని, అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగ ఆరోపణలపై చర్చకు ప్రభుత్వం అంగీకరించాలని రాహుల్ స్పష్టం చేసినట్లు సమాచారం. ఈ రెండు అంశాలు పరిష్కారమైతేనే సభ సజావుగా నడుస్తుందని కాంగ్రెస్ తెలిపినట్లు తెలుస్తోంది.

### ఎఫ్‌సీఆర్ఏ బిల్లుపై అమిత్ షా ప్రకటన?

ప్రస్తుతం డిలిమిటేషన్ బిల్లును ఈ సమావేశాల్లోనే ప్రవేశపెడతారా లేదా అన్నదానిపై స్పష్టత లేకపోయినా, విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లు–2026పై చర్చ సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ప్రసంగించే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి.

### చర్చ లేకుండానే ఐదు బిల్లుల ఆమోదం

జులై 20న ప్రారంభమైన వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం ఒక్కరోజు కూడా పూర్తిస్థాయిలో జరగలేదు. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఐదు బిల్లులు చర్చ లేకుండానే ఆమోదం పొందాయి. బుధవారం కూడా ప్రతిపక్ష నినాదాల నడుమ సభ పలుమార్లు వాయిదా పడగా, చివరకు రోజంతా వాయిదా వేశారు. ఈ సందర్భంగా సభలో ప్లకార్డులు ప్రదర్శించడం, నినాదాలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని స్పీకర్ ఓం బిర్లా సభ్యులకు సూచించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ప్రజలకు సంబంధించిన కీలక అంశాలు చర్చకు రాకపోవడం ఆందోళనకరమని ఆయన వ్యాఖ్యానించారు.



# దుబాయ్‌లో భారీ పేలుళ్లు

- పారిశ్రామిక ప్రాంతంలో వరుసగా ఏడు పేలుళ్లు
- ఆకాశాన్ని కమ్మేసిన పొగ
- జెబెల్ అలీలో భయాందోళనలు

**దుబాయ్:** యూఏఈలోని దుబాయ్ జెబెల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం రాత్రి వరుస పేలుళ్లు చోటుచేసుకోవడంతో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియోల్లో దట్టమైన నల్లపొగ ఆకాశాన్ని కమ్మేసిన దృశ్యాలు కనిపించాయి. ఇరాన్‌కు చెందిన మెహర్ వార్తా సంస్థ కథనం ప్రకారం, 20 నిమిషాల వ్యవధిలో కనీసం ఏడు పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటన ఉద్దేశపూర్వక దాడి ఫలితమా, లేక పారిశ్రామిక ప్రమాదమా అన్న దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఘటనను చిత్రీకరిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఇరాన్ మీడియా పేర్కొంది. అయితే దీనిపై యూఏఈ అధికారులు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అమెరికా–ఇరాన్ యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో యెమెన్ నుంచి యూఏఈపై క్షిపణి దాడి జరిగిందని కొన్ని ఇరాక్ మీడియా సంస్థలు ప్రచారం చేశాయి. అయితే ఈ వార్తలను యూఏఈ ప్రభుత్వం ధ్రువీకరించలేదు. మరోవైపు నాసా థర్మల్ ఉపగ్రహ చిత్రాల ప్రకారం, జెబెల్ అలీ పోర్టు సమీపంలోని ఇంధన నిల్వ, బదిలీ గిడ్డంగిలో అగ్నిప్రమాదం సంభవించినట్లు సమాచారం.

### నివాస ప్రాంతాల వరకూ ప్రభావం

పేలుళ్ల అనంతరం సమీపంలోని నివాస ప్రాంతాల వరకు దట్టమైన పొగ వ్యాపించినట్లు వీడియోల్లో కనిపించింది. అల్ ఫుర్జాన్ ప్రాంత వాసులు కూడా అదే సమయంలో భారీ శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియాకు తెలిపారు. దుబాయ్ నగరానికి నైరుతి దిశలో ఉన్న జెబెల్ అలీ యూఏఈలో అత్యంత కీలకమైన పారిశ్రామిక, వాణిజ్య కేంద్రం. ప్రపంచంలోనే అతిపెద్ద మానవ నిర్మిత నౌకాశ్రయాల్లో ఒకటైన జెబెల్ అలీ పోర్టు, ఫ్రీ ట్రేడ్ జోన్ ఇక్కడే ఉన్నాయి. అమెరికా–ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో యూఏఈ ఇప్పటికే అప్రమత్తంగా ఉండటంతో ఈ ఘటనకు ప్రాధాన్యం సంతరించుకుంది.

# రెపో రేటులో మార్పులేదు

- వరుసగా మూడోసారి వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచిన ఆర్‌బీఐ
- పశ్చిమాసియా సంక్షోభం, ఇంధన ధరల అనిశ్చితిపై దృష్టి
- వృద్ధి అంచనా 6.7 శాతానికి పెంపు
- ద్రవ్యోల్బణ అంచనా 5 శాతానికి తగ్గింపు



**ముంబై:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ఇంధన ధరల అనిశ్చితి, సరఫరా వ్యవస్థలో అంతరాయాల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని భారతీయ రిజర్వు బ్యాంకు కీలక వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వరుసగా మూడోసారి రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగించాలని ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దేశ ఆర్థిక వృద్ధి అంచనాను స్వల్పంగా పెంచి 6.7 శాతంగా నిర్ణయించిన ఆర్‌బీఐ, ద్రవ్యోల్బణ అంచనాను 5 శాతానికి తగ్గించింది. అయితే జూన్‌లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 4.38 శాతానికి చేరి, ఆర్‌బీఐ మధ్యకాల లక్ష్యం 4 శాతాన్ని అధిగమించినప్పటికీ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది.

### రూపాయిపై ఒత్తిడి

ఈ ఏడాది ఆరంభం నుంచి డాలర్‌తో పోలిస్తే రూపాయి నిరంతరం బలహీనపడుతోంది. ప్రస్తుతం డాలర్‌కు రూ.95–96 మధ్య ట్రేడవుతోంది. ఖరీదైన ముడి చమురు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, పెరుగుతున్న వాణిజ్య లోటు, డాలర్ బలోపేతం వంటి కారణాలతో 2026లో రూపాయి సుమారు 7 శాతం విలువ కోల్పోయింది. ఇరాన్ సంక్షోభం ప్రారంభమైనప్పటి నుంచి మాత్రమే దాదాపు 6 శాతం మేర రూపాయి క్షీణించింది.

## ప్లాస్టిక్ నోట్లకు ఆర్‌బీఐ గ్రీన్ సిగ్నల్

**వచ్చే ఏడాది నుంచి కొత్త తరహా కరెన్సీ నోట్లు**

ఎక్కువకాలం మన్నిక కలిగిన ప్లాస్టిక్ (పాలి మర్) కరెన్సీ నోట్లను వచ్చే ఆర్థిక సంవత్సరం (20 27–28) ప్రారంభంలో చలామణిలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ద్వైమాసిక ద్రవ్య విధాన సమీక్ష అనంతరం బుధవారం మీడియాతో మాట్లాడుతూ, ప్రణాళిక ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తయితే వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే ఈ నోట్లు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పాలిమర్ నోట్లు సాధారణ కాగితపు నోట్లతో పోలిస్తే ఎక్కువకాలం మన్నికగా ఉంటాయని మల్హోత్రా చెప్పారు. ముఖ్యంగా ఎక్కువగా చేతులు మారే తక్కువ విలువ కలిగిన నోట్లకు ఇవి మరింత ఉపయోగకరంగా ఉంటాయని వివరించారు. ఇప్పటికే కొన్ని దేశాల్లో ఈ తరహా నోట్లు 30 ఏళ్లకుపైగా విజయవంతంగా వినియోగంలో ఉన్నాయని పేర్కొన్నారు.

### రూపాయి బలోపేతానికి అవకాశం

విదేశీ కరెన్సీ నాన్–రెసిడెంట్ (బ్యాంక్) డిపాజిట్ పథకం కింద నిధుల ప్రవాహం ఆశాజనకంగా కొనసాగుతోందని, ప్రస్తుతం ఈ పథకాన్ని ముందుగానే నిలిపివేసే ప్రతిపాదన ఏదీ లేదని మల్హోత్రా వెల్లడించారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గితే రూపాయి మరింత బలపడే అవకాశం ఉందని, రూపాయి మారకపు విలువ స్థిరంగా ఉండేలా ఆర్‌బీఐ చర్యలు కొనసాగిస్తుందని తెలిపారు.



# కీవ్‌పై డ్రోన్ల దాడి

**కీవ్:** ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో పాటు పరిసర ప్రాంతాలపై రష్యా బుధవారం తెల్లవారుజామున క్షిపణులు, డ్రోన్లతో భారీ దాడులు చేసింది. ఈ దాడుల్లో 17 మంది మృతి చెందగా, 44 మంది గాయపడినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ తెలిపారు. రష్యా 24 బాలిస్టిక్ క్షిపణులు, నాలుగు హైపర్‌సోనిక్ లేదా సూపర్‌సోనిక్ క్షిపణులు, 115 డ్రోన్లతో దాడి చేసినట్లు ఉక్రెయిన్ వెల్లడించింది. పౌర వ్యాపార సంస్థల గిడ్డంగులు, మౌలిక సదుపాయాలు, రైల్వే స్టేషన్‌లను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయని జెలెన్‌స్కీ ఆరోపించారు. కీవ్ పరిసర ప్రాంతాల్లోని పలు గిడ్డంగులు, లాజిస్టిక్స్ కేంద్రాలు, నిర్మాణ సామగ్రి నిల్వ కేంద్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఉక్రెయిన్‌లోని ప్రముఖ రిటైల్ సంస్థ ఎపిసెంటర్‌కు చెందిన రెండు ప్రధాన లాజిస్టిక్స్ కేంద్రాలు ధ్వంసమయ్యాయి. కంపెనీకి చెందిన సిరామిక్ టైల్స్ తయారీ యూనిట్ కూడా పూర్తిగా దెబ్బతినడంతో ఉత్పత్తిని తాత్కాలికంగా విదేశాలకు తరలించాల్సి వచ్చినట్లు సంస్థ వెల్లడించింది. బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకునే వైమానిక రక్షణ వ్యవస్థలు, ఇంటర్‌సెప్టర్ క్షిపణులు తగినంతగా అందుబాటులో ఉంటే ప్రాణనష్టం తగ్గేదని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. ఇటువంటి రక్షణ వ్యవస్థల సరఫరాలో జాప్యం మరిన్ని ప్రాణనష్టాలకు దారితీస్తోందని ఆయన మిత్రదేశాలకు విజ్ఞప్తి చేశారు.




# ఏడు క్రీడలకు ఒకే వేదిక

- విశాఖలో పీవీ సింధు స్పోర్ట్స్ సెంటర్
- ఐటీ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా ప్రారంభం



**ప్రజానావ, విశాఖపట్నం:** ఏడు క్రీడా విభాగాలకు ప్రపంచ స్థాయి శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, ఆధునిక మౌలిక సదుపాయాలను ఒకే వేదికపై అందించే లక్ష్యంతో విశాఖపట్నంలోని అరిలోవలో పీవీ సింధు సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ ప్రాజెక్టును ప్రారంభించగా, ఒలింపిక్ పతక విజేత, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కార్యక్రమంలో పాల్గొన్నారు. పీవీ సింధు ఆలోచనతో రూపుదిద్దుకుంటున్న ఈ కేంద్రంలో ఏడు క్రీడా విభాగాలకు శిక్షణ, హైపర్‌ఫార్మెన్స్ కోచింగ్, స్పోర్ట్స్ సైన్స్, రికవరీ, పోషకాహార సేవలు, ఫిట్‌నెస్, విద్యా సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులో ఉంటాయి. దేశంలోనే సమగ్ర క్రీడా–విద్యా కేంద్రంగా దీనిని అభివృద్ధి చేయనున్నారు. ఈ సందర్భంగా పీవీ సింధు మాట్లాడుతూ, ఈ కేంద్రం భారత క్రీడలకు తాను అందిస్తున్న అత్యంత విలువైన సేవ అని పేర్కొన్నారు. తన క్రీడా జీవితంలో సంపాదించిన ఆదాయంలో గణనీయమైన భాగాన్ని ఈ ప్రాజెక్టు కోసం వెచ్చిస్తున్నట్లు తెలిపారు. యువ క్రీడాకారులకు ప్రపంచ స్థాయి శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, విద్య, అవసరమైన మద్దతు అందించే వేదికను ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని చెప్పారు. విశాఖను జాతీయ స్థాయి క్రీడా శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కోచింగ్, ప్రతిభ గుర్తింపు, పరిశోధన భాగస్వామ్యాలు, కమ్యూనిటీ కార్యక్రమాలకు ఈ కేంద్రం కీలక వేదికగా మారనుంది. కార్పొరేట్ సంస్థలు, దాతలు తమ సీఎస్ఆర్ నిధుల ద్వారా సహకరించాలని పీవీ సింధు కోరారు. 2028 మే నాటికి ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# గోల్‌పోస్ట్ నుంచి ప్రపంచకప్ వరకు!

- అనుకోకుండా గోల్‌కీపర్‌గా మారిన యువకుడికి జాక్‌పాట్
- 24ఏళ్లకే భారత హాకీ ప్రపంచకప్ జట్టులో చోటు
- ప్రో లీగ్ విజయాలతో పెరిగిన ఆత్మవిశ్వాసం
- ప్రపంచకప్‌లో సత్తాచాటుతానంటున్న కర్ణాటక కుర్రోడు మోహిత్



**న్యూఢిల్లీ:** పాఠశాల జట్టులో గోల్‌కీపర్ లేకపోవడంతో అనుకోకుండా ఆ బాధ్యతలు చేపట్టిన కర్ణాటక యువ ఆటగాడు మోహిత్ హెచ్‌ఎస్.. ఇప్పుడు భారత హాకీ జట్టులో ప్రపంచకప్ ఆడే స్థాయికి ఎదిగాడు. ఈ నెల 15 నుంచి 30 వరకు నెదర్లాండ్స్, బెల్జియం సంయుక్తంగా నిర్వహించనున్న ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్‌లో 24ఏళ్ల మోహిత్ తన కలను సాకారం చేసుకోనున్నాడు. భారత జట్టులో అనుభవజ్ఞుడు సూరజ్ కర్కేరాతో కలిసి గోల్‌కీపర్‌గా మోహిత్‌కు అవకాశం దక్కింది. అంతర్జాతీయ అనుభవం తక్కువగా ఉన్నప్పటికీ, ఇటీవల ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో అతడి నిలకడైన ప్రదర్శన సెలెక్టర్లను ఆకట్టుకుంది.

### అనుకోని మలుపుతో మారిన కెరీర్

పాఠశాల హాకీ జట్టులో గోల్‌కీపర్ లేకపోవడంతో కోచ్.. మోహిత్ ఎత్తును దృష్టిలో ఉంచుకొని ఆ బాధ్యతలు అప్పగించారు. అదే అతడి కెరీర్‌కు కీలక మలుపుగా మారింది. అనంతరం జూనియర్ ప్రపంచకప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన అతడు, తన ప్రతిభతో సీనియర్ జట్టులో స్థానం సంపాదించాడు. భారత దిగ్గజ గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్ నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని మోహిత్ తెలిపాడు. ఆయన స్థానాన్ని భర్తీ చేయాలనే ఒత్తిడి కంటే దేశం కోసం పూర్తిస్థాయిలో కృషి చేయాలనే బాధ్యతే తనపై ఉందని పేర్కొన్నాడు. జూనియర్ ప్రపంచకప్‌లో భారత్ నాలుగో స్థానంతో సరిపెట్టుకోవడం తనలో పెద్ద టోర్నీల్లో విజయం సాధించాలనే పట్టుదలను పెంచిందని మోహిత్ చెప్పాడు. ఇటీవల ప్రో లీగ్‌లో నెదర్లాండ్స్, జర్మనీ వంటి అగ్రశ్రేణి జట్లపై సాధించిన విజయాలు భారత జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని తెలిపాడు. ప్రపంచకప్‌లో లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భారత్‌ను మరోసారి ప్రపంచ చాంపియన్‌గా నిలబెట్టేందుకు తనవంతు కృషిచేస్తానని మోహిత్ స్పష్టం చేశాడు. భారత్ ఇప్పటివరకు ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్‌లో 1975లో కౌలాలంపూర్‌లో జరిగిన టోర్నీలో మాత్రమే స్వర్ణ పతకం సాధించింది. ఐదు దశాబ్దాల తర్వాత మరోసారి ప్రపంచ విజేతగా నిలవాలన్న లక్ష్యంతో భారత జట్టు ఈసారి బరిలోకి దిగుతోంది.

# సింధు, లక్ష్యకు అనుకూలం

- అయుష్‌కు తొలి రౌండ్‌లోనే గట్టి సవాల్
- సాత్విక్–చిరాగ్‌కు తొలి రౌండ్ బై
- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ డ్రా విడుదల



**న్యూఢిల్లీ:** ఈ నెల 17 నుంచి 23 వరకు ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరగనున్న బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు బుధవారం డ్రా విడుదలైంది. భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్‌కు తొలి రౌండ్‌లో అనుకూల ప్రత్యర్థులు ఎదురుకాగా, ఆసియా చాంపియన్‌షిప్ రజత పతక విజేత అయుష్ షెట్టికి మాత్రం డిఫెండింగ్ చాంపియన్, చైనా స్టార్ షి యుకీతోనే తొలి మ్యాచ్‌లో తలపడాల్సి రావడం ఆసక్తికరంగా మారింది. మరోవైపు పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి–చిరాగ్ శెట్టి జోడీకి తొలి రౌండ్‌లో బై లభించింది. ఆరు ప్రపంచ చాంపియన్‌షిప్ పతకాలతో ఇప్పటికే చరిత్ర సృష్టించిన పీవీ సింధు తన ప్రచారాన్ని ఐర్లాండ్‌కు చెందిన సోఫియా నోబెల్‌పై ప్రారంభించనుంది. డ్రా ప్రకారం పతకాల దశకు ముందు ప్రపంచ నంబర్‌వన్ ఆన్ సె యంగ్, డిఫెండింగ్ చాంపియన్ అకానే యమగుచిలను ఎదుర్కొనే పరిస్థితి లేకపోవడం సింధుకు కలిసొచ్చే అంశంగా కనిపిస్తోంది. 2021 ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత లక్ష్యసేన్ తొలి రౌండ్‌లో ఆస్ట్రియాకు చెందిన కొలిన్స్ వాలెంటైన్ ఫిలిమోన్‌తో తలపడనున్నాడు. అతడు రెండో రౌండ్‌ను దాటితే ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ కున్లావుట్ విటిడ్సార్న్‌తో పోరాడే అవకాశం ఉంది. ఇక పురుషుల డబుల్స్‌లో ఐదో సీడ్‌గా బరిలోకి దిగుతున్న సాత్విక్‌సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీకి తొలి రౌండ్‌లో బై లభించింది. రెండో రౌండ్‌లో స్కాట్లాండ్‌కు చెందిన అలెగ్జాండర్ డన్–ఆడమ్ ప్రింగిల్ జోడీ లేదా థాయ్‌లాండ్‌కు చెందిన చలోంపోన్ చరోన్‌కిటామోర్న్–వొర్రాపోల్ థోంగ్సాంగా జోడీతో తలపడనుంది. మిశ్రమ డబుల్స్‌లో ధృవ్ కపిల–తనీషా క్రాస్టో జోడీకి కూడా తొలి రౌండ్‌లో బై దక్కింది.

### భారత్‌కు అనుకూలంగా డ్రా

డ్రాపై స్పందించిన భారత జాతీయ ప్రధాన కోచ్ పుల్లెల గోపీచంద్.. మొత్తంగా భారత ఆటగాళ్లకు అనుకూలమైన డ్రా వచ్చిందని అభిప్రాయపడ్డారు. షి యుకీతో తొలి రౌండ్‌లోనే ఆడడం అయుష్ షెట్టికి కఠిన పరీక్షే అయినప్పటికీ, అతని దూకుడు ఆటతో సంచలనం సృష్టించే సామర్థ్యం ఉందని అన్నారు. స్వదేశీ పరిస్థితులు, ఇటీవల చేసిన సన్నాహక శిబిరం భారత ఆటగాళ్లకు ప్రయోజనం చేకూరుస్తాయని, ముఖ్యంగా లక్ష్యసేన్, అయుష్ ఇద్దరికీ పతకం సాధించే అవకాశాలు ఉన్నాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.




# బ్యాంకింగ్ వ్యవస్థపై ఆందోళన అక్కర్లేదు




- విండో డ్రెస్సింగ్ ఆరోపణలపై పటిష్ఠ నిఘా
- ఉల్లంఘనలపై కఠినచర్యలు
- బ్యాంకుల వాస్తవ ఆర్థిక పరిస్థితిని దాచలేరు: ఆర్‌బీఐ గవర్నర్

**ముంబై:** త్రైమాసిక ఫలితాల ముందు ఆర్థిక గణాంకాలను మెరుగ్గా చూపించేందుకు బ్యాంకులు విండో డ్రెస్సింగ్‌కు పాల్పడుతున్నాయన్న ఆరోపణలపై భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. ఈ వ్యవహారంపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బ్యాంకుల కార్యకలాపాలపై ఆర్‌బీఐ పటిష్ఠమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ద్రవ్య విధాన సమీక్ష అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డిపాజిట్లు వంటి కీలక గణాంకాలను తాత్కాలికంగా మెరుగ్గా చూపించినా బ్యాంకుల వాస్తవ ఆర్థిక పరిస్థితిలో ఎలాంటి మార్పు ఉండదన్నారు. ప్రస్తుతం పెట్టుబడిదారులు, ఖాతాదారులు బ్యాంకుల నిజమైన ఆర్థిక స్థితిని అంచనా వేసే అవగాహన కలిగి ఉన్నందున, ఇలాంటి చర్యల ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనం పొందడం సాధ్యం కాదని పేర్కొన్నారు. విండో డ్రెస్సింగ్‌కు సంబంధించి ఆర్‌బీఐ మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని, పర్యవేక్షణ అధికారులు బ్యాంకుల కార్యకలాపాలను నిరంతరం పరిశీలిస్తున్నారని మల్హోత్రా తెలిపారు. ఏ బ్యాంకు లేదా నియంత్రిత ఆర్థిక సంస్థ నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### పటిష్ఠంగా భారత బ్యాంకింగ్ వ్యవస్థ

ఈ సందర్భంగా ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ జె మాట్లాడుతూ, ప్రపంచ ఆర్థిక ఒడిదుడుకుల మధ్య కూడా భారత బ్యాంకింగ్ వ్యవస్థ పటిష్ఠంగానే కొనసాగుతోం దన్నారు. బ్యాంకులు, బ్యాంకేతర ఆర్థిక సంస్థలపై ప్రత్యక్ష, పరోక్ష పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతోందని, ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విడివిడిగా చోటుచేసుకునే సంఘటనలను కూడా సమర్థవంతంగా పరిష్కరిస్తున్నామని ఆయన వివరించారు.




## టారిఫ్ మార్పులపై ఎయిర్‌టెల్ ఫోకస్

**న్యూఢిల్లీ:** తక్కువ ధరకు అన్‌లిమిటెడ్ డేటా అందిస్తున్న మొబైల్ ప్లాన్ల టారిఫ్‌లలో మార్పులు చేసే అవకాశాలు ఉన్నాయని భారతీ ఎయిర్‌టెల్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ గోపాల్ విఠల్ వెల్లడించారు. ప్రస్తుత ధరల నిర్మాణం కారణంగా వినియోగదారుడి సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) పరిమితమవుతోందని, దీర్ఘకాలిక లాభదాయకత కోసం సమతుల్య టారిఫ్ విధానం అవసరమని ఆయన పేర్కొన్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 37.3 శాతం పెరిగి రూ.8,167 కోట్లకు చేరగా, కార్యకలాపాల ఆదాయం రూ.58,539 కోట్లకు పెరిగింది.

## ఎయిరిండియా కొత్త సీఈఓగా టెవోల్డే గెబ్రెమారియం

- ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ మాజీ అధినేతకు కీలక బాధ్యతలు
- క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో నియామకం
- విస్తరణ దశలో కొత్త నాయకత్వం

**న్యూఢిల్లీ/ముంబై:** ఎయిరిండియా కొత్త మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ గ్రూప్ మాజీ సీఈఓ టెవోల్డే గెబ్రెమారియంను నియమించినట్లు సంస్థ బుధవారం ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో రాజీనామా ప్రకటించిన క్యాంప్‌బెల్ విల్సన్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు. అంతర్గత అభ్యర్థులతో పాటు ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రముఖులను పరిశీలించిన అనంతరం గెబ్రెమారియంను ఎంపిక చేసినట్లు ఎయిరిండియా తెలిపింది. నష్టాల నుంచి బయటపడుతూ విస్తరణ ప్రణాళికలను అమలు చేస్తున్న కీలక సమయంలో ఈ నియామకం జరిగింది. ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ గ్రూప్‌కు సీఈఓగా పనిచేసిన గెబ్రెమారియం, బహుళ బిలియన్ డాలర్ల విస్తరణకు నాయకత్వం వహించి, ప్రాంతీయ సంస్థను ఆఫ్రికాలోనే అతిపెద్ద, అత్యధిక లాభదాయక విమానయాన సంస్థగా తీర్చిదిద్దిన అనుభవం కలిగి ఉన్నారని ఎయిరిండియా పేర్కొంది.

## రూ.35 లక్షల కోట్ల వ్యాపారమే లక్ష్యం

- 2032 నాటికి 2.3 రెట్ల వృద్ధిపై ఇండియన్ బ్యాంక్ దృష్టి
- 125వ వార్షికోత్సవం నాటికి గ్లోబల్ బ్యాంకుగా ఎదగడమే లక్ష్యం
- ఎండీ, సీఈఓ బినోద్ కుమార్

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ 2032 నాటికి మొత్తం వ్యాపారాన్ని (డిపాజిట్లు, రుణాలు) రూ.35 లక్షల కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. 125వ వ్యవస్థాపక దినోత్సవం నాటికి గ్లోబల్ బ్యాంకుగా ఎదగడమే తమ లక్ష్యమని బ్యాంకు ఎండీ, సీఈఓ బినోద్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.15.29 లక్షల కోట్లుగా ఉందని, 2032 నాటికి దీనిని 2.3 రెట్లు పెంచనున్నట్లు చెప్పారు. గత 15–18 నెలల్లోనే రూ.2.70 లక్షల కోట్ల వ్యాపార వృద్ధి నమోదైందని, 2002 నుంచి బ్యాంకు నిరంతర లాభాల్లో కొనసాగుతోందని పేర్కొన్నారు. దేశంలో ఏడో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకుగా ఉన్న ఇండియన్ బ్యాంక్‌కు 6,000కు పైగా శాఖ లు, 29 వేల టచ్‌పాయింట్లు ఉన్నాయి. 2026–27 తొలి త్రైమాసికంలో నికర లాభం 10 శాతం పెరిగి రూ.3,273 కోట్లకు చేరగా, నికర వడ్డీ ఆదాయం 17 శాతం వృద్ధితో రూ.7,435 కోట్లకు పెరిగింది.

# చివరి నిమిషాల్లో కోలుకున్న మార్కెట్లు

- తీవ్ర హెచ్చుతగ్గుల తర్వాత లాభాల్లో ముగిసిన సూచీలు
- బ్యాంకింగ్, ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు



**ముంబై:** భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) వరుసగా నాలుగోసారి రెపో రేటును యథాతథంగా కొనసాగించడంతో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లు ఒడిదొడుకుల మధ్య స్వల్ప లాభాలతో ముగిశాయి. రోజంతా తీవ్ర హెచ్చుతగ్గులు నమోదైనప్పటికీ చివరి గంటలో బ్యాంకింగ్, ఆటో, క్యాపిటల్ గూడ్స్ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో మార్కెట్లు కోలుకున్నాయి. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 152.05 పాయింట్లు (0.19%) లాభపడి 78,581 వద్ద ముగిసింది. ఒక దశలో 79,055.38 గరిష్ఠాన్ని తాకిన సూచీ, మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడితో 78,285.74 కనిష్ఠానికి పడిపోయింది. చివర్లో కొనుగోళ్లు పెరగడంతో తిరిగి లాభాల్లోకి వచ్చింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 9.75 పాయింట్లు పెరిగి 24,624.65 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,677.60 గరిష్ఠం, 24,497.95 కనిష్ఠాన్ని నమోదు చేసింది. ద్రవ్య విధాన కమిటీ రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా ఉంచడంతో పాటు, ప్రస్తుత ఆర్థిక సంవత్సర వృద్ధి అంచనాను 6.6 శాతం నుంచి 6.7 శాతానికి పెంచింది. ద్రవ్యోల్బణ అంచనాలను తగ్గించడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌కు ఊతమిచ్చిందని విశ్లేషకులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లో అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. మరోవైపు టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.

## రూపాయి జోరు

- డాలర్‌తో పోలిస్తే 20 పైసలు పుంజుకుని రూ.95.08 వద్ద ముగింపు

**ముంబై:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారతీయ రూపాయి బుధవారం 20 పైసలు బలపడి రూ.95.08 వద్ద ముగిసింది. ఆర్‌బీఐ వరుసగా నాలుగోసారి రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగించడం, అంతర్జాతీయ మార్కెట్లలో డాలర్ బలహీనపడడం, పశ్చిమాసియా ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం రూపాయి పుంజుకోవడానికి దోహదపడినట్లు ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారక మార్కెట్‌లో రూపాయి 94.90 వద్ద ప్రారంభమై 94.89–95.25 మధ్య కదలాడి, మంగళవారం ముగింపు రూ.95.28తో పోలిస్తే 20 పైసలు లాభపడి రూ.95.08 వద్ద స్థిరపడింది. జూలై 23 నుంచి వరుసగా తొమ్మిది ట్రేడింగ్ సెషన్లలో రూపాయి మొత్తం 165 పైసలు (1.7 శాతం) బలపడడం విశేషం. ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ రెపో రేటును యథాతథంగా కొనసాగించడంతో పాటు విధాన వైఖరిని న్యూట్రల్‌గానే ఉంచింది.

# హెచ్‌డీఎఫ్‌సీలో నైతిక విలువలకు ముప్పులేదు

- కార్పొరేట్ పాలనకు అత్యున్నత ప్రాధాన్యం
- వాటాదారుల విశ్వాసాన్ని కాపాడతాం
- 2027 నుంచి మెరుగుపడ్డ కాసా డిపాజిట్లు, వడ్డీ మార్జిన్లు
- నాన్–ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాజీవ్ కుమార్




**ముంబై:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో నైతిక విలువలు లేదా సంస్థాగత ప్రమాణాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేవని బ్యాంకు నాన్–ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాజీవ్ కుమార్ స్పష్టం చేశారు. అత్యున్నత కార్పొరేట్ పాలన ప్రమాణాలను పాటిస్తూ వాటాదారుల విశ్వాసాన్ని కాపాడేందుకు బోర్డు కట్టుబడి ఉందని బుధవారం జరిగిన 32వ వార్షిక సర్వసభ్య సమావేశంలో తెలిపారు. ఇటీవల మాజీ చైర్మన్ అతను చక్రబర్తి రాజీనామా తర్వాత తలెత్తిన సందేహాల నేపథ్యంలో బ్యాంకు బ్యాలెన్స్‌షీట్ బలంగా ఉందని, నైతికతకు సంబంధించిన ఎలాంటి సమస్యలు లేవని ఆయన పేర్కొన్నారు. బ్యాంకు మంచి పేరును నిలబెట్టుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. బ్యాంకు ఎండీ, సీఈఓ శశిధరన్ జగదీషన్ మాట్లాడుతూ, గత ఐదేళ్లలో 4,000 కొత్త శాఖలు, సాంకేతిక రంగంలో పెట్టుబడుల ఫలితంగా 2027 మధ్యకాలం నుంచి కరెంట్, సేవింగ్స్ (కాసా) డిపాజిట్ల వాటా పెరుగుతుందని తెలిపారు. దీంతో నికర వడ్డీ మార్జిన్లు కూడా మెరుగుపడతాయని చెప్పారు. జనరేటివ్ ఏఐ పెట్టుబడుల ఫలితాలు కొంత ఆలస్యంగా వచ్చినా, ఇప్పటికే చేసిన సాంకేతిక పెట్టుబడులు బ్యాంకు వృద్ధికి దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

# ఫౌజీ కోసం భారీ చార్మినార్ సెట్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న ప్రతిష్ఠాత్మక పీరియడ్ యాక్షన్ డ్రామా ఫౌజీ పై అభిమానుల్లో రోజురోజు అంచనాలు పెరుగుతున్నాయి. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా చిత్రీకరణ కోసం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో చార్మినార్ సెట్ నిర్మిస్తుండటం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా చార్మినార్ నేపథ్యంలో సన్నివేశాలు చిత్రీకరించాలంటే పాతబస్తీ ప్రాంతాన్నే ఎంచుకుంటారు. అయితే 'ఫౌజీ' బృందం మాత్రం అందుకు భిన్నంగా నిర్ణయం తీసుకుంది. గచ్చిబౌలి–లింగంపల్లి ప్రధాన రహదారిలోని పాత అల్యూమినియం ఫ్యాక్టరీ ప్రాంగణంలో అసలు చార్మినార్‌ను తలపించేలా భారీ సెట్‌ను ప్రత్యేకంగా నిర్మిస్తోంది. నిజమైన కట్టడాన్ని పోలి ఉండేలా అత్యంత నైపుణ్యంతో ఈ సెట్‌ను రూపొంది స్తున్నట్లు తెలుస్తోంది. ప్రభాస్‌కు ఉన్న అపారమైన అభిమానుల ఆదరణను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. పాతబస్తీలో షూటింగ్ నిర్వహిస్తే వేలాది మంది అభిమానులు అక్కడికి చేరుకునే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు, భద్రతా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని చిత్రబృందం భావించింది. షూటింగ్ ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేందుకు ప్రత్యేకంగా ఈ భారీ సెట్‌ను నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 3 నుంచి ప్రారంభమైన ఈ షెడ్యూల్ దాదాపు 25



రోజుల పాటు కొనసాగనుంది. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్ కీలక సన్నివేశాల్లో పాల్గొననున్నారని సమాచారం. ఈ దశ పూర్తయిన తర్వాత సినిమా చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తవుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అనంతరం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేసి విడుదలకు సిద్ధం చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ అధినేత వై. రవిశంకర్ స్పందిస్తూ, ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే డిసెంబర్ 3న 'ఫౌజీ' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని స్పష్టం చేశారు. దాదాపు రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్, టీ–సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాతో ఇమాన్వి టాలీవుడ్‌కు కథానాయికగా పరిచయం కానుండగా, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయ ప్రద వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తు న్నారు. చారిత్రక నేపథ్యం, విజువల్ గ్రాండి యర్, ప్రభాస్ స్టార్‌డమ్ కలయి కతో 'ఫౌజీ' భారతీ య సినీ ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది.

# డీప్‌ఫేక్‌పై మృణాల్ ఆగ్రహం

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ సృష్టిస్తున్న డీప్‌ఫేక్ ఫొటోలు, వీడియోలు సెలబ్రిటీలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు ఈ సమస్యను ఎదుర్కొనగా, తాజాగా ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్ కూడా డీప్‌ఫేక్ బారిన పడ్డారు. ఇటీవల ఎక్స్ (ట్విటర్)లోని ఓ పేజ్‌లో ఆమెకు సంబంధించిన మార్ఫింగ్ చేసిన డీప్‌ఫేక్ ఫొటోలు ప్రత్యక్షమయ్యాయి. అవి క్షణాల్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై మృణాల్ ఠాకూర్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పేరుతో డీప్‌ఫేక్ ఫొటోలను సృష్టించి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం పూర్తిగా చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, సంబంధిత ఫొటోలను వెంటనే తొలగించాలని హెచ్చరించారు. లేదంటే న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.

అంతేకాకుండా, ఇకపై ఆ ఫొటోలను ఎవరైనా షేర్ చేసినా లేదా ప్రచారం చేసినా వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. గతంలో రష్మిక మందన్నతో పాటు పలువురు సినీ నటీమణులు కూడా ఏఐ ఆధారిత డీప్‌ఫేక్ కంటెంట్‌కు బలయ్యారు. ఆ ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీయగా, పోలీసులు కొందరు నిందితులను అరెస్ట్ చేశారు. పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ ఘటనలను ఖండిస్తూ, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే ఇలాంటి డీప్‌ఫేక్ కంటెంట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. టెక్నాలజీ అభివృద్ధి ఎంత అవసరమో, దాని దుర్వినియోగాన్ని అరికట్టడం కూడా అంతే ముఖ్యమని నిపుణులు పేర్కొంటున్నారు. డీప్‌ఫేక్ కంటెంట్ వల్ల వ్యక్తిగత ప్రతిష్ఠ దెబ్బతినడమే కాకుండా సమాజంలో తప్పుడు సమాచార వ్యాప్తికి కూడా అవకాశం ఉంటుందని వారు హెచ్చరిస్తున్నారు.



# శూర్పణఖ పాత్ర సంక్లిష్టమైనది: రకుల్

మునుపెన్నడూ చేయని శూర్పణఖ అనే కొత్త పాత్రతో 'రామాయణ' సినిమాలో అలరించడానికి రకుల్ ప్రీత్ సింగ్ సన్నద్ధమవు తోంది. ఈ నేపథ్యంలోనే ఓ అభిమాని 'మీరీ పాత్రను అంగీకరించడానికి కారణమేంటని అడగ్గా.. దీనికి సామాజిక మాధ్యమాల వేదికగా బదులిస్తూ.. ఓ పోస్ట్ పెట్టింది రకుల్. శూర్పణఖ పాత్రను ఒప్పుకోవడానికి కారణం ఆమెలోని సంక్లిష్టత. చరిత్ర తరచుగా ఆమెను వలం ఒ ఒక్క ఘట్టం ద్వారా మాత్రమే గుర్తుంచుకుంటుంది. కానీ ఆమె కథ వెనుక అంతకు మించి ఎన్నో విషయాలు దాగి ఉన్నాయి. అందు ఈ ఛాలెంజింగ్ పాత్రకు ఒ చెప్పా. 'రామాయణ' థియేటర్లలోకి వచ్చినప్పుడు ప్రేక్షకులు ఈ శూర్పణఖ పాత్రను ఒక కొత్త కోణంలో, విశాలమైన మనసుతో అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నానని ఆ పోస్ట్‌లో పేర్కొంది.

# భావోద్వేగాలతో ఆకట్టుకుంటున్న 'తుడక్కం' ట్రైలర్

తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో రూపొందిన భావోద్వేగ యాక్షన్ థ్రిల్లర్ 'తుడక్కం' ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మోహన్‌లాల్ కుమార్తె విస్మయ మోహన్‌లాల్, ఆశిష్ జో ఆంటోనీ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి జూడ్ ఆంటోనీ జోసెఫ్ దర్శకత్వం వహించగా, ఆంటోని పెరుంబవూర్ నిర్మించారు. ఆగస్టు 7న విడుదల కానున్న ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది. ట్రైలర్ ఆరంభంలోనే తండ్రీకూతుళ్ల మధ్య ఉన్న ఆప్యాయత, అనుబంధాన్ని ప్రతిబింబించే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. "మంచిగా చదువుకోమని నీకు ఎంతకాలం నుంచి చెబుతున్నాను. ప్రియను చూడు... ఆమె ప్రతి పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధిస్తుంది" అంటూ తండ్రి చెప్పే మాటలతో కథ మొదలవుతుంది. అనంతరం ఊహించని సంఘటనలు, ఉద్రిక్త పరిస్థితులు,



భావోద్వేగ సన్నివేశాలతో కథ ఆసక్తికర మలుపు తిరుగుతుంది. "నాన్న... ఆరోజు జరిగినదంతా మర్చిపోండి. అది ఒక పొరపాటు మాత్రమే. మళ్లీ అలాంటి తప్పు జరగదు" అనే సంభాషణతో పాటు, "నీ నోరు అదుపులో పెట్టుకో... లేదంటే కష్టాలు మీ ఇంటి తలుపు తడతాయి" వంటి డైలాగ్‌లు చిత్రంపై మరింత ఉత్కంఠను పెంచుతున్నాయి. కుటుంబ కథకు యాక్షన్, థ్రిల్లర్ అంశాలను మేళవిస్తూ దర్శకుడు కథను తీర్చిదిద్దినట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ట్రైలర్ చివర్లో మోహన్‌లాల్ అతిథి పాత్రలో సీరియస్ లుక్‌లో కనిపించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆయన ఎంట్రీ కథలో కీలక మలుపుకు సంకేతంగా కనిపిస్తోంది. భావోద్వేగాలు, ఉత్కంఠ, యాక్షన్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఎంత మేర ఆకట్టుకుం టుందో చూడాలి. ఈ చిత్రంలో సాయి కుమార్, బాబీ కురియన్, మనోజ్ కె. జయన్, కేబీ గణేష్ కుమార్, అశ్విన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# డెక్స్ట్రోకార్డియా కాన్సెప్ట్‌తో 'చిరంజీవి'

కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'చిరంజీవి' ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. శుభ సాయి వెంకట్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని దీప్తి నడిమింటి కికు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈశ్వరి రావు, తనికెళ్ల భరణి, శ్రీకాంత్ భరత్, వైవా రాఘవ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 28న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. టీజర్‌ను పరిశీలిస్తే, కథానాయకుడు చిరంజీవి డెక్స్ట్రోకార్డియా అనే అరుదైన వైద్య పరిస్థితితో బాధపడుతుంటాడు. ఈ వ్యాధి కారణంగా అతని గుండె సాధారణంగా ఎడమవైపు కాకుండా కుడివైపు ఉంటుంది. అలాంటి యువకుడిని కథానాయిక ప్రాణంగా ప్రేమిస్తుంది. అయితే ఇద్దరూ కలిసి ఉన్న సమయంలో చిరంజీవి గుండె అకస్మాత్తుగా ఎడమవైపు కొట్టుకుంటున్నట్లు ఆమె గుర్తిస్తుంది. దీంతో తన ముందున్న వ్యక్తి నిజంగా చిరంజీవేనా? లేక అతని స్థానంలో మరెవరైనా ఉన్నారా? అనే అనుమానం ఆమెకు కలుగుతుంది. ఈ ఒక్క ట్విస్ట్‌తో టీజర్‌పై క్యూరియాసిటీ మరింత పెరిగింది. కథలో సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలు బలంగా



ఉండబోతున్నాయనే సంకేతాలు కనిపిస్తున్నాయి. చివర్లో హీరోను గ్రే షేడ్‌లో చూపిస్తూ టీజర్‌ను ముగించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. విజువల్స్, నేపథ్య సంగీతం, ఉత్కంఠభరిత సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. ప్రేమ, భావోద్వేగాలు, సస్పెన్స్, థ్రిల్లర్ అంశాలను మేళవిస్తూ రూపొందిన 'చిరంజీవి' ఈ నెల 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. కొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

# రామాయణపై అనుమానాలా?



నితీశ్ తివారీ దర్శకత్వంలో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న 'రామాయణ' చిత్రం విడుదలకు ముందే వివాదంలో చిక్కుకుంది. దిల్లీలోని శ్రీ రావ్‌లీలా మహాసంఘ్ అధ్యక్షుడు అర్జున్ కుమార్ ఈ సినిమాపై ఆందోళనను వ్యక్తం చేస్తూ.. చిత్ర బృందానికి లేఖ రాశారు. సినిమా విడుదలయ్యే ముందే తమకు చూపించాలని.. లేదంటే నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ చిత్రం హిందూ మత విశ్వాసాలను, మనోభావాలను దెబ్బతీసేలా ఉండదదనే ఉద్దేశంతో లేఖ రాస్తున్నట్లు అర్జున్ కుమార్ వివరించారు. టీజర్, ట్రైలర్ చూసిన తర్వాత తమకు కొన్ని విషయాల్లో అసంతృప్తి కలిగిందని ఆయన తెలిపారు. 'మేము ఈ సినిమాను స్వాగతిస్తున్నాం. లక్షలాది మంది ప్రజలు దీనిని చూడాలని కోరుకుంటున్నాం. రావ్‌లీలా కమిటీ సభ్యుల కోసం ఉచిత ప్రదర్శనలను డా ఏర్పాటు చేస్తాం. అయితే, ట్రైలర్ మాకు కొంత బాధ కలిగించింది. అందులో కొన్ని భావోద్వేగాలు సరిగ్గా లేవని మాకు అనిపించింది. అలాగే, నటీనటుల కాస్ట్యూమ్స్ డా కొన్ని సన్నివేశాల్లో ఆమోదయోగ్యంగా లేవు. అందు ఈ సినిమా విడుదలకు ముందు మాకు కచ్చితంగా చూపించాలని డిమాండ్ చేశారు. గతంలో వచ్చిన 'ఆదిపురుష్' సినిమాలోని కొన్ని సన్నివేశాల విషయంలో వచ్చిన వ్యతిరేకత నేపథ్యంలో.. ఈసారి ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. 'రామాయణ' సినిమాలో కొన్ని సన్నివేశాలు/సంభాషణలు అభ్యంతరకరంగా ఉండే అవకాశం ఉందనే సమాచారం తమకు అందిందని, అందు ముందుగానే స్క్రీనింగ్ నిర్వహించి వాటిని తొలగించాలని కోరుతున్నట్లు చెప్పారు. ఒకవేళ తమ అభ్యర్థనను మేకర్స్ పట్టించుకోకుండా.. సినిమాలో అభ్యంతరకర అంశాలు ఉంటే థియేటర్లలో నిరసనలు చేపడుతామని అర్జున్ కుమార్ హెచ్చరించారు.

# కరుప్పు విడుదల సమయంలో ఆర్థిక ఇబ్బందులు

ఇటీవల 'కరుప్పు'తో విజయాన్ని అందుకున్నారు అగ్ర కథానాయకుడు సూర్య. అయితే ఈ సినిమా సమయంలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందులను, ఆ క్లిష్ట సమయంలో తన భార్య జ్యోతిక అందించిన మద్దతును తాజాగా గుర్తు చేసుకున్నారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూర్య ఈ అంశంపై మాట్లాడారు. కరుప్పు సినిమా విడుదలకు ముందు చివరి నిమిషంలో ఆర్థిక పరమైన, పంపిణీ సమస్యలు ఎదురయ్యాయి. ఆ సమయంలో సినిమాను థియేటర్లలో ప్రదర్శించడం కోసం అదనపు రుణాలు తీసుకోవాల్సి వచ్చింది. అది మా కుటుంబానికి పెద్ద రిస్క్. కానీ, జ్యోతిక నాపై ఉంచిన నమ్మకమే నేను ధైర్యంగా ముందడుగు వేసేలా చేసింది. ఆ రిస్క్ విషయంలో ఆమె నాకు కొండంత అండగా నిలిచిందని సూర్య పేర్కొన్నారు. దీనిపై ఇదే ఇంటర్వ్యూలో జ్యోతిక స్పందిస్తూ.. ఆ సినిమా విషయంలో పూర్తి ఘనత సూర్య చెందుతుంద న్నారు. నేను ఈ ప్రశంసను స్వీకరించను. మేము ఏ నిర్ణయమైనా కలిసే తీసుకుంటాం. పిల్లల పెంపకం విషయంలోనూ మేమిద్దరం ఎప్పుడూ ఒ అభిప్రా యంతో ఉంటాం. ముందు మేం చర్చించుకుని తర్వాత పిల్లలకు వివరిస్తాం అని తెలిపారు. ఇక 'కరుప్పు' గురించి సూర్య మాట్లాడుతూ.. ఆర్.జే బాలాజీ ఈ ప్రాజెక్ట్ కోసం దాదాపు రెండున్నర సంవత్సరాలు కష్టపడ్డారని అన్నారు. ఈ సినిమా విజయం చాలా మంది జీవితాలను మార్చేసిందని తెలిపారు. ఫైనాన్షియర్లు డా సహకరించారని వెల్లడించారు. సూర్య, త్రిష ప్రధా నపాత్రల్లో తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూలు చేసి విజయాన్ని సొంతం చేసుకుంది.

# 'మహారాణి 5'లో హ్యూమా ఖురేషీ



ప్రభుత్వ నాయకులతో పోరాడాల్సి వచ్చిన ఓ సాధారణ గృహిణి రాజకీయాల్లో ఎలా ఎదిగి శక్తిమంతమైన నాయకురాలిగా మారిందనే కథాంశంతో రూపొందిన వెబ్‌సిరీస్ 'మహారాణి' ఓటీటీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. బాలీవుడ్ నటి హ్యూమా ఖురేషీ ప్రధాన పాత్రలో నటించిన ఈ సిరీస్‌కు మంచి ఆదరణ లభించడంతో వరుస సీజన్లు విడుదలయ్యాయి. ఇటీవల 'మహారాణి 5' రానున్నట్లు ప్రకటించిన చిత్రబృందం ఇప్పుడు తాజా అప్‌డేట్‌ను వెల్లడించింది. ఈ నెల 6 నుంచి 'మహారాణి 5' చిత్రీకరణను హ్యూమా ఖురేషీ ప్రారంభించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ప్రీ–ప్రొడక్షన్ పనులు పూర్తికాగా, వచ్చే ఏడాది జనవరిలో కొత్త సీజన్‌ను ఓటీటీ వేదికగా విడుదల చేయాలనే లక్ష్యంతో మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. గత సీజన్లలో ప్రేక్షకులను ఆకట్టుకున్న రాజకీయ డ్రామాను మరింత ఆసక్తికరంగా ఈసారి రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఈ సీజన్‌లోనూ హ్యూమా ఖురేషీ రాణి భారతి పాత్రలో కనిపించనుంది. సాధారణ గృహిణి నుంచి రాజకీయాల్లో తనదైన ముద్ర వేసే నాయకురాలిగా ఆమె పాత్ర సాగే తీరు ఈ సిరీస్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కొత్త సీజన్‌లో మరిన్ని రాజకీయ పరిణామాలు, భావోద్వేగాలు, అధికార పోరాటం, ఉత్కంఠభరితమైన సంఘటనలు ఉండనున్నాయని సమాచారం. ఇదిలా ఉంటే, హ్యూమా ఖురేషీ ప్రస్తుతం నటించిన 'టాక్సిక్' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా తర్వాత ఆమె పూర్తిస్థాయిలో 'మహారాణి 5' షూటింగ్‌పై దృష్టి సారించనుంది. కొత్త సీజన్‌పై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# రెమ్యూనరేషన్ ముఖ్యం కాదు

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్, టాలెంటెడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా సినిమాకు సంబంధించి వస్తున్న వార్తలపై మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఈ చిత్రంలో నటించేందుకు సల్మాన్ ఖాన్ తన పారితోషికాన్ని భారీగా తగ్గించుకున్నారంటూ గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. అయితే ఆ వార్తలను సినిమా నిర్మాతలు తాజాగా ఖండించారు. ఆ ప్రచారమంతా పూర్తిగా నిరాధారమైనదని స్పష్టం చేశారు. ఇలాంటి ఊహాగానాలపై స్పందించడం కంటే, ప్రేక్షకులకు ఒక అద్భుతమైన సినిమా అనుభూతిని అందించడమే తమ ప్రధాన లక్ష్యమని మేకర్స్ పేర్కొన్నారు. ఎస్‌విసి 63'గా పిలవబడుతున్న ఈ సినిమా ప్రస్తుతం అత్యంత కీలకమైన ముంబై యాక్షన్ షెడ్యూల్‌కు సిద్ధమవుతోంది. 2027 ఈద్ కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతుండగా, ఇందులో భాగంగా ఆగస్టు 6 నుంచి ముంబైలో భారీ యాక్షన్ షెడ్యూల్ ప్రారంభం కానుంది. దాదాపు ఆరు వారాల పాటు సాగనున్న ఈ షెడ్యూల్‌లో మూడు భారీ యాక్షన్ సీక్వెన్స్‌లతో పాటు వందలాది మంది జూనియర్ ఆర్టిస్టులతో డిన పెద్ద ఎత్తున క్రౌడ్ సీన్స్ చిత్రీకరించనున్నారు. సెప్టెంబర్ అంతటా ఈ షూటింగ్ కొనసాగనుండగా, అక్టోబర్ నాటికి యాక్షన్ పార్ట్ మొత్తాన్ని పూర్తి చేయాలని



చిత్ర యూనిట్ టార్గెట్ పెట్టుకుంది. సల్మాన్ ఖాన్ స్టంట్స్‌తో పాటు జనాల మూవ్‌మెంట్ డా చాలా కీలకంగా ఉండే ఈ షెడ్యూల్‌లో ప్రముఖ నటి నయనతార డా యూనిట్‌తో చేరనున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా 120 కోట్లకు పైగా రెమ్యునరేషన్ తీసుకునే సల్మాన్ ఖాన్, ఈ సినిమా కోసం దానిని సుమారు 70 కోట్లకు తగ్గించుకున్నారని, నిర్మాత రఫీ కాజీతో ఉన్న స్నేహం కారణంగానే ఈ ఫీజు తగ్గింపు జరిగిందని గతంలో వార్తలు వచ్చాయి. అయితే వీటిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేనప్పటికీ, ఇప్పుడు మేకర్స్ ఆ వార్తలను పూర్తిగా కొట్టిపారేశారు.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.